J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

DSR® GROUP
CEMENTING DREAMS SINCE 1988
CELEBRATING 37 YEARS of DSR GROUP

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 48 02.05.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

RERA NO.: P09480275346

DSR THE ONE 1

| OPEN SPACE | UNITS | FLOORS |
|---|---|---|
| 80% | 90 | 30 |

| LAND AREA | UNIT AREA |
|---|---|
| 2.1 Acres | 3199-4555 SFT. |



CLUBHOUSE AREA
20000 SFT.
The One Club:
Where relaxation ends and focused ambition begins.

AMENITIES
20+
Amenities thoughtfully designed for comfort, with distinctive experiences

Harnathpuram Extension, NH-16
NELLORE CITY

SCAN FOR THE LOCATION


ENTRY PORTAL


PATHWAY


PLAY AREA


CO-WORKING SPACE

Swimming Pool | Indoor Gym | Basketball Court | Wellness Spa | Sports Area | Pickle Ball Court

DSR® GROUP
CEMENTING DREAMS SINCE 1988
CELEBRATING 37 YEARS of DSR GROUP

FOR MORE INFORMATION CONTACT US
+91 95625 85858 | dsrinfra.com

Bengaluru Office: DSR Infrastructure Private Limited, DSR Techno Cube, Varthur Road, Thubarahalli, Bengaluru, Karnataka - 560 066.
Hyderabad Office: DSR Group, Plot 221, Road Number 17, Jawahar Colony, Jubilee Hills, Hyderabad, Telangana - 500 033.

# సేవకు నిలువెత్తు రూపం..విపిఆర్

## - కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రశంస

ఎంతోమంది డబ్బు సంపాదిస్తారని, అయితే కొద్ది మందికి మాత్రమే తమ ధనాన్ని ప్రజలకు పంచే మంచిమనసు ఉంటుందని, అలాంటి దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని, సేవకు ఆయన నిలువెత్తు రూపమని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రశంసించారు. ఇటీవల కావలిలో దివ్యాంగులకు వేమిరెడ్డి సహకారంతో విద్యుత్ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఒక్కొక్కటి రూ.40వేల విలువచేసే ట్రైసైకిళ్లను దివ్యాంగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కావ్య మాట్లాడుతూ, నిజమైన నీతిమంతుడు, సమాజ సేవా తత్పరుడు, తాను సంపాదించిన డబ్బులో కొంత భాగం దేవుడికి ఇవ్వడంతో పాటు, మరికొంత భాగం ప్రజల సేవకు అర్పిస్తూ మహనీయమైన దాతగా నిలిచారని విపిఆర్‌ని కీర్తించారు. మానవ సేవే మాధవసేవ అని భావించి, జిల్లా వ్యాప్తంగా వేలాదిగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసిన వ్యక్తి ప్రభాకర్‌రెడ్డి అని, నెల్లూరు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో దివ్యాంగులను గుర్తించి ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్‌ను అందించడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమని అన్నారు. తాను రాజకీయాల్లోకి రాకముందునుంచే విపిఆర్ ప్రజాసేవ చేస్తున్నారని, వేమిరెడ్డి దంపతులు దాతృత్వం ఎనలేనిదని ఈ కార్యక్ర మంలో పాల్గొన్న ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర అన్నారు. తమ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించే కార్యక్రమం నిర్వహించే ఘనత ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇటీవల తాము తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలిగా, కోవూరు శాసనసభ్యురాలుగా



ఉన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలిసి బిట్రగుంట వెంకటేశ్వరస్వామి కోనేరును బాగుచేయాలని కోరామని, దానికి వేమిరెడ్డి దంపతులు అంగీకరించి 2 కోట్ల రూపాయలతో కోనేరు బాగుచేసేందుకు అంగీకారం తెలపడం గొప్పవిషయమని అన్నారు. సుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కావలి జనసేన ఇన్‌చార్జి అలహరి సుధాకర్, బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగుల బాధలు తీర్చడానికే.. - ఎంపీ వేమిరెడ్డి

ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగుల బాధలను చూసిన తర్వాత, తాను వారికి ఏం మేలు చేయగలుగుతామా అన్న ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. నడవ లేని దివ్యాంగులకు, వారి ఆత్మస్థైర్యం కోల్పోకుండా చేయడం కోసం ట్రై సైకిల్స్ అందిస్తున్నామన్నారు. ఉదయగిరితో ప్రారంభమైన ఈ కార్యక్రమం.. ప్రస్తుతం కావలిలో జరుగుతుందన్నారు. ఇప్పటివరకు దాదాపు 850 ట్రై సైకిల్స్ అందించగలిగామన్నారు. వీటిని అందించడమే కాకుండా, వాటి మెయింటినెన్స్ కూడా తమ విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోనే చేపడుతామన్నారు. దివ్యాంగులు జాగ్రత్తగా వీటిని నడపాలని ఆయన సూచించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడంలోనే తనకు ఆనందం ఉందని, అందుకే పట్టుదలతో చేస్తున్నానన్నారు. మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేసేందుకు కూడా ప్రయత్నిస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలో ఉన్న ఎమ్మెల్యేల సహకారంతోనే తాము ఇలాంటి కార్యక్రమాలు చేయగలుగుతున్నామని, వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

## మే 17 నుంచి.. 27 వరకు

# జొన్నవాడ కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు

### ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చొరవతో 12 మందితో సేవా కమిటీ



బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి నూతన సేవా కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బ్రహ్మోత్సవాలకు సేవా కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, ఆ మేరకు కమిటీని ఏర్పాటుచేస్తూ ఆయన ఆదేశాలు ఇచ్చారు. కామాక్షితాయి అమ్మవారి సేవాకమిటీకి తిరువూరు అశోక్‌రెడ్డి, కనపర్తి నాగేంద్ర, నక్కల శివకృష్ణ, తిరువాయిపతి నందకుమార్, ముంగర సుధాకర్, శశిశేఖర్ శర్మ (అర్చక), పాలూరు చాముండేశ్వరి, కొల్లపూడి శారద, పెన్నత్తూరు సుమలత, గంధ్రకోట రమాదేవి, జొన్నలగడ్డ వరలక్ష్మి, ఇమ్మడిశెట్టి సౌజన్యలక్ష్మి ఎన్నికయ్యారు. వీరు మే 17 నుంచి 27వతేదీ వరకు జరగనున్న అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో తమ సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా సేవా కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి తమ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే ఈ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

# మంత్రి ఆనంతో..ఎంపీ వేమిరెడ్డి భేటీ



రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఇటీవల నెల్లూరు నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వేమిరెడ్డి వెళ్లగా, ఆయన్ను మంత్రి సాదరంగా ఆహ్వానించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర ముఖ్యవిషయాలపై వారిరువురు సుదీర్ఘంగా చర్చించుకున్నారు.

# సత్యకుమార్ ఆలోచనల సమాహారం 'సత్యకాలమ్'

## 2వ వ్యాస సంకలనాన్ని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సామాజిక, రాజకీయ, ఆర్థిక వాస్తవ పరిస్థితులపై ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆలోచనల సమాహారం, వ్యాస సంకలనం 'సత్యకాలమ్-2' ఏప్రిల్ 27 ఆదివారం సాయంత్రం విజయవాడలో ఆవిష్కృతమయ్యింది. ఆరు సంవత్సరాల పాటు 'సత్యకాలమ్' పేరుతో ఒక దిన పత్రికలో నిరంతరాయంగా ఈ వ్యాసాలు ప్రచురితమయ్యాయి. 89 వ్యాసాలున్న ఈ రెండవ పుస్తకాన్ని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మరో అతిథిగా విచ్చేసి తొలి ప్రతిని అందుకున్నారు.

ఈ సందర్భంగా కూటమి నేతలు ప్రసంగిస్తూ జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడికి ధీటైన సమాధానం చెప్పాలని ఉమ్మడి స్వరంతో పిలుపునిచ్చారు. 2016లో ఇదే రీతిన యూరీ ప్రాంతంలోనూ, 2019లో పుల్వామా ప్రాంతంలో జరిగిన దాడులకు ప్రతీకారంగా ప్రభావవంతమైన సర్జికల్ దాడులతో భారత్ జవాబిచ్చిందని, అంతకంటే పదునైన ప్రతీకార చర్యల్ని ఈసారి చేపడతామని శపథం చేశారు.

### ప్రతి వ్యాసంలోనూ నా బాధ్యతని గుర్తుపెట్టుకున్నాను!

#### - కృతికర్త రాష్ట్ర మంత్రి సత్యకుమార్

తొలుత ప్రారంభోపన్యాసం చేసిన సత్యకుమార్ సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై ప్రధానంగా దృష్టిపెట్టి వ్యాసాలు రాసేలా ఆరేళ్ళపాటు తనని ప్రేరేపించిన అనేక సందర్భాలని గుర్తుచేసుకుంటూ సభకి వివరించారు. కరడుకట్టిన భారతీయ జనతాపార్టీ కార్యకర్తగా తన ప్రతి వ్యాసంలోనూ తన బాధ్యతని గుర్తుపెట్టుకుని రాశానని సత్యకుమార్ అన్నారు.

ప్రధాని మోదీ నాయకత్వంలో 2014 నుంచి ఆవిష్కారమవుతున్న నవ భారతం యొక్క వివిధ కోణాల్ని ప్రజలకు వివరించడానికి 2019 నుంచి వ్యాసాలు రాశానని చెప్పారు. దేశ సమగ్ర ప్రగతి కోసం, పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడానికి మోదీ ప్రభుత్వం చేపట్టిన పలు చర్యల్ని ఆయన వివరించారు. 12 కోట్ల మరుగు దొడ్ల నిర్మాణం,



పేదలకు 4కోట్ల ఇళ్ల నిర్మాణం, అతి తక్కువ కాలంలో 12కోట్ల ఇళ్లకు రక్షిత మంచినీటి కుళాయిల ఏర్పాటు, స్వయం ఉపాధికి 3 లక్షల కోట్ల రూపాయలకు పైగా రుణాల మంజూరు మోదీ సంకల్పానికి నిదర్శనమని సత్యకుమార్ అన్నారు. ప్రధాని మోదీ ఎదుగుదలను జీర్ణించుకోలేని కాంగ్రెస్ తమ సుదీర్ఘ పాలనలో వివిధ రాష్ట్రాల్లో 77 ఏళ్ల పాటు ఎమర్జెన్సీని విధించిందని ఎద్దేవా చేశారు. పటిష్టమైన దేశీయ, విదేశీ విధానాలతో భారతదేశం మోదీ నాయకత్వంలో ప్రపంచశక్తిగా ఎదిగిందని సత్య తెలిపారు.

### క్రమశిక్షణ కలిగిన నాయకుడు సత్యకుమార్

#### - కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

దేశాన్ని ఎంతో దార్శనికతతో, నిబద్ధతతో, సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ విమర్శలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తిప్పికొట్టారు. దేశంలో 19 నెలల పాటు ఎమర్జెన్సీని విధించి ప్రజాస్వామ్యాన్ని హరించిన కాంగ్రెస్‌కు మోదీని నియంతగా పేర్కొనే అర్హత ఏమాత్రమూ లేదని అన్నారు. గత 11 ఏళ్ల పాలనలో మోదీ ప్రభుత్వంపై ఒక్క అవినీతి ఆరోపణ లేదని, దీనికి భిన్నంగా కాంగ్రెస్ పాలన చరిత్ర మొత్తం అవినీతి దుర్గంధంలో కూరుకుపోయిందని కిషన్‌రెడ్డి తెలిపారు. పార్టీలో అత్యంత క్రమశిక్షణ కలిగిన కార్యకర్త స్థాయినుండి సత్యకుమార్‌తో తనకి పరిచయం ఉందన్నారు. ఈనాడు అదే క్రమశిక్షణతో మంత్రిస్థాయికి ఎదిగారని కీర్తించారు. సమాజంలోని అనేక అంశాల పైన సత్యకుమార్‌కి పూర్తి అవగాహన ఉందని, ఆ అనుభవమే ఆయన చేత ఆరేళ్లపాటు నిరంతరాయంగా వ్యాసాలను రాయించిందని ప్రశంసించారు. వీటితో పాటు మరో ఆంగ్లపత్రికలో కూడా సత్యకుమార్ వ్యాసాలు రాయడం అభినందనీయమన్నారు.

### చీకటి నుంచి వెలుగు వైపు

#### - మంత్రి నాదెండ్ల మనోహర్

గడచిన 2019-24 కాలంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అంధకారంలోకి నెట్టబడిందని, అలంటి రాష్ట్రాన్ని వెలుగువైపు నడిపించడానికి కూటమి ప్రభుత్వం సర్వ ప్రయత్నాలూ చేస్తోందని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు, పారదర్శక విధానాలు, సమర్థవంతమైన పాలనకు ప్రధాని మోదీ ప్రతీక అని, భాజపా నాయకులు ఎంతో నిబద్ధతతో జీవిస్తారని చెప్పారు. ఎన్ని సమస్యలనైనా ఎదుర్కొని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్న విశ్వాసాన్ని మంత్రి వ్యక్తం చేశారు.

### సత్యకుమార్ వ్యాసాలు రేపటి యువతకి పాఠ్యాంశాలు

#### - పల్లా శ్రీనివాసరావు

రాష్ట్రంలో కూటమి సారథ్యంలోని సమర్థ నాయకత్వం, ప్రజా రంజక పాలనను అందిస్తోందని తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గత ప్రభుత్వం మద్యం, మైనింగ్ వంటి పలు అక్రమాలకి, ఆగడాలకు పాల్పడి రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిందన్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడడానికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని చెప్పారు. సత్యకుమార్ లాంటి నైపుణ్యత కలిగిన నాయకుల నేతృత్వంలో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి పథంలో నడుస్తోందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సత్యకుమార్ రాసిన వ్యాసాలు రాజకీయాలలోకి రావాలనుకునే యువతకి పాఠ్యాంశాలుగా ఉపకరిస్తాయని చెప్పారు.

ఆత్మీయ ఆనంద సంబరంగా జరిగిన ఈ ఆవిష్కరణ వేడుకలో అనేకమంది అధికార, అనధికార ప్రముఖులు, సత్యకుమార్ సన్నిహితులు, స్నేహితులు, అభిమానులు పాల్గొన్నారు. ఎమెస్కో బుక్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ 'సత్యకాలమ్-2'ని ప్రచురించింది. సత్యకాలమ్ మొదటి సంపుటి 2022 జూన్‌లో విడుదలై పుస్తకప్రియులకి అందుబాటులోకి వచ్చింది.

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 48 02.05.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## కలల రాజధానికి పునరుజ్జీవం



# అదిగో.. అల్లదిగో అమరావతి!

> రెండవసారి రానున్న ప్రధాని

> రాజధాని పునర్నిర్మాణానికి పునాది

***2015 అక్టోబర్ 22...***

- గుంటూరు జిల్లా ఉద్దండరాయునిపాలెంలో ఆంధ్రుల కలల రాజధాని అమరావతి పురుడుపోసుకున్న రోజు.
- సాక్షాత్తూ ప్రధాని హోదాలో నరేంద్రమోడీ స్వహస్తాలతో పనులను ప్రారంభించిన రోజు.
- నవ్యాంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు.
- విభజనతో అన్యాయమైపోయిన సగటు ఆంధ్రుడు గర్వంగా తలెత్తుకునేలా చేసిన రోజు.
- మేం నిర్మించుకుంటున్న మా రాజధానే, ఇకపై మాకూ ఉండబోతోంది.. అని భావించిన రోజు.
- గతంలో మద్రాస్‌ను నుంచి తరిమేశారు. తర్వాత హైదరబాద్ నుంచి గెంటేశారు. ఇకపై అలా జరగదు, తొలి ఆంధ్రపాలకులు శాతవాహనులు ఏలిన గడ్డ నుంచే మళ్లీ మా ప్రయాణం ప్రారంభిస్తాం, పాలనను పరుగులు పెట్టిస్తాం, అంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రోజు.
- ఇకపై మేం ఎవరికీ తీసిపోం... అంటూ సగటు ఆంధ్రుడు కాలర్ ఎగరేసిన రోజు.
- భవిష్యత్‌ను తలచుకుని ఉద్వేగంతో హృదయం ఉప్పొంగిన రోజు.

కాలం గిర్రున తిరిగింది.. 2025 మే 2... మరోసారి ప్రధాని హోదాలో నరేంద్రమోడీ

4లో

## గుండె గు'బిల్లు'



- తాకితే..
- షాక్ కొడుతున్న కరెంటు బిల్లులు
- విస్తుపోతున్న వినియోగదారులు

14లో



## డిసిసిబి ఛైర్మన్‌గా మళ్లీ మెట్టుకూరు

**జి**ల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్(డిసిసిబి) అధ్యక్ష పదవి రెండవ సారి మెట్టుకూరు ధనుంజయ రెడ్డిని వరించింది. గతంలో 2013 నుండి 2019 వరకూ ఆయన రాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా, జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఛైర్మెన్‌గా ఆరు సంవత్స రాల పాటు బ్యాంకు

4లో



## సంస్మరణ

నాయకులకే నాయకుడు
ఎందరికో మార్గదర్శకుడు
దీనజన బాంధవుడు
జన నేత... మన జనార్ధనుడు

అభివృద్ధి ప్రదాత.. మాజీ ముఖ్యమంత్రి

### డా॥ నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారు

స్వర్గస్తులై తేది.09.05.2025 నాటికి
పదకొండేళ్ళు గడవనున్న సందర్భంగా
వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ...

నేదురుమల్లి కుటుంబ సభ్యులు
బంధుమిత్రులు
మరియు అభిమానులు

# అదిగో.. అల్లదిగో అమరావతి!

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే దశాబ్ద కాలంలో తెలుగునేలపై రాజకీయ పరిణామాలు శరవేగంగా మారిపోయాయి. పెత్తనం చెలాయించే పాలకులు మారారు. భూములిచ్చిన రైతులు అనాథలయ్యారు. దీంతో రాజధానిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆంధ్రుల ఆశలు ఆవిరయ్యాయి. కలల సౌధాలు కల్లలయ్యాయి. కొందరు అమరావతిని కమ్మరావతి అంటే, మరి కొందరు భ్రమరావతి అంటూ ఎగతాళి చేశారు. ఇంకొందరు శ్మశానం అంటూ ఎద్దేవా చేశారు. కన్నడీయులకు బెంగళూరు, తమిళులకు చెన్నై, మలయాళీలకు తిరువనంతపురం, తెలంగాణకు హైదరాబాద్ ఉన్నాయి. మరి ఆంధ్రులకు ఆశలు ఆవేదనలు తప్ప ఏం ఉన్నాయి..? ఏం మిగిలాయి..? అంటూ శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ప్రజలందరూ వాపోయారు. తమ రాష్ట్ర అభివృద్ధిపై కమ్ముకున్న నీలినీడలు ఎప్పుడు తొలగిపోతాయో తెలియక తల్లడిల్లారు.

## సవాళ్ల మధ్య విడిపోయి!

2014 జూన్ 2 ఉమ్మడి తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ అధికారికంగా రెండుగా విడిపోయింది. తెలంగాణలో రాష్ట్ర విభజన కోసం ఉద్యమించిన కేసీఆర్, నవ్యాంధ్రలో చంద్రబాబు పాలనా పగ్గాలు అందుకున్నారు. విభజన చట్టం ప్రకారం పదేళ్ల పాటు ఉమ్మడి రాజధాని హైదరాబాద్ నుంచే పాలన సాగించాల్సిన అగత్యం ఏర్పడింది. అయితే రాజ్యానికి సంబంధంలేని రాజధానిలో పాలకులు ఉండి, ప్రజలను అక్కడి నుంచి పాలించడం ఏంటనే వాదనలూ వినిపించాయి. అదే క్రమంలో హైదరాబాద్‌ను వదులుకుని సర్వస్వం కోల్పోయిన ఆంధ్రులకు మళ్లీ ఓ రాజధాని నిర్మించాలనే ప్రతిపాదనలూ వచ్చాయి. అప్పట్లో ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ, కేంద్రం సాయంతో కొత్త రాజధానిగా గుంటూరు, విజయవాడ మధ్య ఉన్న అమరావతిని ఎంపిక చేసింది. అయితే అత్యధిక పోషకాలున్న సారవంతమైన నల్లరేగడి నేలను, నీటి పారుదల అధికంగా ఉండే ప్రాంతాన్ని, కృష్ణానది ముంపునకు గురయ్యే ప్రమాదం ఉన్న ఏరియాను రాజధానిగా ఎంచుకోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. కానీ తొలి తెలుగు పాలకులు అయిన శాతవాహన రాజుల పాలనలో అమరావతి నగరం మహోద్భుతంగా వర్ధిల్లిందని... అదే స్ఫూర్తితో మళ్లీ అభివృద్ధిబాట పట్టేందుకు ఆ దారిలోనే నడవాలని భావిస్తున్నట్లు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అలాగే అటు ఉత్తరాంధ్ర ప్రజలకు, ఇటు రాయలసీమ ప్రజలకు సమానదూరంలో ఉండడం కోసం అమరావతిని ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఇదే అదునుగా ప్రధాని మోడీని పిలిపించి అంగరంగ వైభవంగా అమరావతికి శంకుస్థాపన చేశారు. అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో పాటు జపాన్, సింగపూరు ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అప్పుడు నీరు మట్టి..
## మరి ఇప్పుడో..?

రాజధాని నగరానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోడీ యమునానది నుంచి నీటిని, మట్టిని తీసుకొచ్చి అమరావతి మట్టిలో కలిపారు. దేశరాజధాని అంత పటిష్టంగా, గొప్పగా అమరావతిని తీర్చిదిద్దేందుకు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ విభజిస్తే, బీజేపీ నిర్మిస్తుందంటూ ప్రకటించారు. ప్రజలంతా తమతమ ప్రాంతాల్లోని మట్టి నమూనాలను తీసుకొచ్చి అమరావతి శంకుస్థాపన ప్రాంతంలో కలిపి నిజమైన ప్రజల రాజధానిగా భావించి నిర్మాణంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో మానవ వనరులను మెరుగుపరిచే దిశలో 11 జాతీయ సంస్థలను ఇక్కడ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రజలు కేంద్రం ప్రారంభించిన స్టార్టప్ ఉద్యమం ద్వారా తమ సొంత రాష్ట్రంలో ఆర్థిక విప్లవానికి నాందిపలకాలని సూచించారు. కేంద్రం ప్రారంభించిన స్మార్ట్‌సిటీల నిర్మాణంలో భాగంగా ఆర్థిక వృద్ధికి, ఆదాయ ఉత్పత్తికి కేంద్రంగా అమరావతి ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. చరిత్రలో తెలుగు సంస్కృతికి గౌరవం ఇచ్చిన ప్రదేశంలో కొత్త రాజధానిని నిర్మించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయదశమినాడు చొరవ తీసుకుంది, దానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇక కష్ట సమయంలో మోడీ ఇచ్చిన హామీలను, భరోసాను ప్రజలు మరిచిపోరని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో తొలిసారి అమలు చేసిన ల్యాండ్ పూలింగ్ పథకంలో భాగంగా అమరావతి నిర్మాణం కోసం 33వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చిన 25వేల మంది రైతులకు రాజధాని ప్రారంభోత్సవ సభలో చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. అయితే తర్వాత బాలారిష్టాలు చుట్టుముట్టి అమరావతి ఎక్కడిగొంగళి అక్కడే అన్న చందంగా మారింది. జగన్ పాలనలో అమరావతి కనుమరుగయ్యే పరిస్థితికి చేరింది. ఈనేపథ్యంలో అమరావతి పునరుజ్జీవం కోసం రెండవసారి మే 2వ తేదీన రాష్ట్రానికి రానున్న ప్రధాని ఈసారి ఏం తెస్తారో, ఏం ఇస్తారో, ఏం చెప్తారో..? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## అత్యాధునిక అవకాశాల నగరంగా!

గతంలో అమరావతికి పునాదిరాయి వేసిన సందర్భంలో ప్రధాని మోదీ అమరావతి మానవ వనరుల రాజధానిగా వెలుగొందుతుందన్నారు. అమరావతి 1.5కోట్ల జనాభా అవసరాలను తీర్చే విధంగా నిర్మిస్తామని, 2035 నాటికి 3.3 మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, 16.9 ఎకరాల్లో ఉన్న కోర్ కేపిటల్ ప్రాంతం నాలుగు మిలియన్ల ప్రజల అవసరాలను తీరుస్తుందని, 2050 నాటికి 1.8 మిలియన్ల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పిస్తుందని అంచనా వేశారు. 16,000 గ్రామాల నుంచి తెచ్చిన మట్టి, పవిత్రజలాలు ఖచ్చితంగా అమరావతి తేజస్సును మరింతగా పెంచుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కలసి నిర్మిద్దాం, కలలు సాధిద్దాం అంటూ పిలుపునిచ్చారు. ఇక్కడి ధ్యాన బుద్ధుడి విగ్రహం బ్రాండ్ అమరావతికి ముఖద్వారం అవుతుందని అభిలషించారు. అయితే ఈ హామీలన్నీ మాటలకే పరిమితం అయ్యాయి. ఈ నేపథ్యంలో మరోసారి పునర్నిర్మాణ సభ పేరుతో అమరావతికి అండాదండా అందించేందుకు, దిశాదశా చూపేందుకు మోడీ తెలుగునేలపై కాలిడనున్నారు. ఐకానిక్ బిల్డింగ్స్‌గా భావిస్తున్న 250 మీటర్ల ఎత్తయిన అసెంబ్లీ, 7 అంతస్తులతో భారీస్థాయిలో నిర్మించనున్న హైకోర్టు పనులను ప్రారంభించనున్నారు. అలాగే 50 అంతస్తులు, 40 అంతస్తులతో కూడిన 5 టవర్స్‌కి భూమి పూజ చేయనున్నారు.

## అప్పుడు తాత్కాలిక నిర్మాణాలు..
## ఇప్పుడు మూడేళ్ల టార్గెట్!

ఇక రాబోయే 100 ఏళ్ల అవసరాలను తీర్చే విధంగా అమరావతిని తీర్చిదిద్దాలనే తలంపుతో చంద్రబాబు గతంలో అనేక విదేశీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. అలాగే తాత్కాలిక ప్రాతిపదిక పేరుతో శాసనసభ, సచివాలయం, హైకోర్టును ఏర్పాటు చేశారు. అయితే ఆ సమయంలో ఎన్డీయేలో విభేదాలు ఏర్పడడం కేంద్ర ప్రభుత్వం నుంచి తెలుగుదేశం మంత్రులు వైదొగలడంతో సరైన ప్రోత్సాహం లేక 2019 నాటికి అమరావతి పునాదులకే పరిమితమైంది. ఇక తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ అమరావతికి మంగళం పాడేలా రాజధానిని గాలికొదిలేసింది. దీంతో ఈసారైనా అమరావతిని పూర్తి స్థాయిలో పట్టాలెక్కించాలని, మూడేళ్లలోనే రాజధాని నగరంలోని ప్రధాన భవనాలన్నీ పూర్తయ్యేలా చంద్రబాబు కార్యాచరణ రూపొందించినట్లు తెలుస్తోంది.

## మూడు రాజధానుల పేరుతో!

ఇక చంద్రబాబు ప్రారంభించిన అమరావతిని ఛిన్నాభిన్నం చేయడమే ధ్యేయం అన్నట్లుగా వైఎస్ జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో కొత్త రాగం అందుకుంది. విశాఖలో సెక్రటరియేట్, అమరావతిలో శాసనసభ, కర్నూల్‌లో హైకోర్టు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. దీంతో రాజధాని రైతులు భగ్గుమన్నారు. అమరావతి పరిరక్షణ సమితి పేరుతో నిరసన దీక్షకు దిగారు. పాదయాత్రలు చేశారు. వీరిపై పోలీసులు జులుం ప్రదర్శించడం, కేసులు పెట్టడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. అయితే తమ మాన ప్రాణాలు పోయినా వెనక్కితగ్గబోమంటూ మొక్కవోని దీక్షతో రాజధాని రైతులు ఏకంగా 1,631 రోజుల పాటు నిరసన దీక్ష చేశారు. 2024 జూన్ 12వ తేదీన చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రి కావడం, వెంటనే ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతే ఉంటుందని ప్రకటించడంతో వారు నిరసన దీక్షను విరమించారు. ఇక కూటమి ప్రభుత్వం కేంద్రం సహకారంతో 15 వేల కోట్ల రూపాయలను రాజధానికి గ్రాంట్‌గా తీసుకురావడంతో మళ్లీ అమరావతి పనులు జోరందుకున్నాయి. ఈనేపథ్యంలో మే2వ తేదీన నరేంద్రమోడీ అమరావతి నిర్మాణ పనులను పునఃప్రారంభించనుండడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈసారైనా ప్రధాని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏదైనా ప్రత్యేక వరాలిస్తారా, లేక నీరు మట్టి, ఉజ్వల భవిష్యత్ అంటూ మాటల మూటలకే పరిమితమౌతారా...? అన్న ప్రశ్నలు జోరందుకున్నాయి.

## రాజధాని చట్టబద్ధతపై ఏం చేస్తారో?

ప్రభుత్వాలు మారినప్పుడు రాజధాని నగరం మార్చడం వంటి తుగ్లక్ చర్యలకు ఇకనైనా మంగళం పాడాలి. ఇదే ఆలోచనతో రాజధాని నగరంపై ఊగిసలాట ధోరణులకు చెక్ చెప్పే విధంగా ప్రధాని మోడీ పునర్నిర్మాణ సభలో ఓ ఫార్ములా సూచించే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటించడమే కాకుండా, రాష్ట్ర కేబినెట్‌లో ప్రతిపాదన తెచ్చి, శాసనసభ ద్వారా ప్రత్యేక తీర్మానం చేసి, దాన్ని కేంద్రానికి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. తర్వాత కేంద్రం పార్లమెంట్‌లో ఓ బిల్లు పెట్టి, అమరావతిని శాశ్వత రాజధానిగా ప్రకటించి న్యాయపరంగా ఉన్న అన్ని సమస్యలను తొలగించాలని భావిస్తున్నట్లు కనిపిస్తోంది. తద్వారా గతంలో జరిగిన పొరపాట్లను పునరావృతం కాకుండా చూడాలని భావిస్తున్నట్లు కూడా తెలుస్తోంది. ఏదేమైనా ఆంధ్రుల ఆశలకు రెక్కలు తొడిగే అమరావతి నిర్మాణానికి ఈసారైనా ఏ ఆటంకం కలగకుండా ఉండాలని ప్రతి ఆంధ్రుడూ మనసా వాచా కోరుకుంటున్నాడనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే అంటున్నాం "అదిగో.. అల్లదిగో అమరావతి"...!

# డిసిసిబి ఛైర్మన్‌గా.. మళ్లీ మెట్టుకూరు

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధికి పాటుపడ్డారు. కాంగ్రెస్ హయాంలో ఛైర్మన్‌గా ఎంపికై ఆ తరువాత తెలుగుదేశం పాలనలో కూడా ఛైర్మన్‌గా కొనసాగిన ఘనత మెట్టుకూరు ధనుంజయరెడ్డిది. పూర్తిగా నష్టాల్లో వున్న బ్యాంకుని ధనుంజయరెడ్డి హయాంలో లాభాల్లోకి తీసుకొచ్చారు. అనేక విప్లవాత్మక సంస్కరణలతో బ్యాంకుని లాభాల బాటలో నడిపించారు. ధనుంజయరెడ్డి అధ్యక్షతన డిపాజిట్లలో, రుణాల మంజూరులో 400 శాతం వృద్ధిని సాధించేలా పాలన సాగించారు. 2019 లోనూ ఆ తరువాత 2024లోనూ ఆయన శాసనసభ టిక్కెట్టు ఆశించి భంగపడ్డారు. అయినా, ఎక్కడా అధైర్యపడలేదు. 2024 ఎన్నికలలో వెంకటగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేశారు. సాంఘిక, సామాజిక, సేవా కార్యక్రమాలలో ధనుంజయరెడ్డి ముందు వరసలో ఉంటారు. ఈ క్రమంలో అనేక అవార్డులు, రివార్డులు ఆయన సొంతం చేసుకున్నారు. సంఘసేవ కోసం సొంతంగా ఒక ట్రస్టుని ప్రారంభించి సేవా కార్యక్రమాలని నిర్వహిస్తున్నారు. బ్యాంకు అభివృద్ధి కోసం గతంలో ధనుంజయరెడ్డి చేసిన కృషి ఆయనకి కలిసొచ్చింది. ఛైర్మెన్ పదవి వెతుక్కుంటూ వచ్చి ఆయనని రెండవసారి వరించింది. త్వరలోనే బాధ్యతలు చేపట్టి అధ్యక్ష స్థానాన్ని అలంకరించనున్నారు.

మెట్టుకూరుకి 'లాయర్' అభినందనలు.

## డిసిఎంఎస్ ఛైర్మన్‌గా
## నాగేశ్వరరావు



జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ఛైర్మన్‌గా వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గంగోటి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఆయన స్వస్థలం పొలుగోడు గ్రామం.. ప్రస్తుతం వెంకటగిరిలోనే నివాసం ఉంటున్నారు. గతంలో ఆయన పెంచలకోన ఆలయ పాలకమండలి ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ఆశించి విఫలమైనా, టీడీపీ బలోపేతానికి ఆయనెంతో కృషిచేశారు. జిల్లాతో పాటు రాష్ట్రస్థాయి టీడీపీ నాయకులతో కూడా ఆయనకు మంచి సంబంధాలున్నాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా కూడా ఆయన పార్టీకి సేవలందించారు. ఆయన శ్రమను గుర్తించి పార్టీ అధిష్ఠానం ఆయన్ను డిసిఎంఎస్ ఛైర్మన్‌గా నియమించడంతో ఆయన అభిమానులు, అనుచరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# యోగా ఉచిత శిక్షణ

నెల్లూరులో ఏప్రిల్ 29 నుంచి వేసవి ధ్యాన, యోగా ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరం యోగా శిక్షకులు ముత్యాల రవీంద్ర ఆధ్వర్యంలో జరుగుతోంది. నెలరోజుల పాటు స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్దనున్న స్వతంత్రపార్కులో నిర్వహించే ఈ శిబిరంలో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని, పిల్లలు, పెద్దలు, మహిళలు ఈ శిబిరంలో పాల్గొనవచ్చని నిర్వాహకుడు రవీంద్ర తెలిపారు.

# ఆదిశంకర సంస్మరణోత్సవాలు

జగద్గురు ఆదిశంకర సంస్మరణ ఉత్సవాలు మే 7 నుంచి 13వ తేదీ వరకు నెల్లూరులోని చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా జరుగనున్నాయి. శృంగేరీ శ్రీ విరూపాక్ష శ్రీపీఠం 46వ పీఠాధిపతులు శ్రీ గంభీరానంద భారతీ మహాస్వాముల వారి పర్యవేక్షణలో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉపనిషత్ భాష్య ప్రవచనాలుంటాయి. రాత్రి 7 నుంచి 7.30 గంటల వరకు శ్రీ స్వామివారి అనుగ్రహ భాషణ ఉంటుందని ఆదిశంకర ధ్యానమందిర కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

# 'నేనున్నా'నంటూ భరోసా ఇచ్చిన.. చంద్రన్న!

## - నారంపేటలో నారావారి సందడి -



'నేనున్నా!..దిగులుపడకండి. లబ్దిదారులను అన్నివిధాలుగా ఆదుకుంటాం.. అధైర్యపడకండి' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇస్తున్న భరోసా అక్కడి ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రే తమ ఇళ్ల వద్దకు వచ్చి, సమస్యలు అడిగి తెలుసుకుని, ఎలాంటి కష్టాలున్నా ఆదుకుంటానని మాటివ్వడంతో ప్రజల్లో సంతోషం వెల్లువెత్తుతోంది. అందుకు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం నెల్లూరుపాలెం గ్రామం వేదికైంది. మే 1వ తేదీ గురువారం ముఖ్యమంత్రి అక్కడున్న ఎస్టీ కాలనీలో "పేదల సేవలో పింఛన్ పంపిణీ" కార్యక్రమంలో పాల్గొని అందరినీ ఆత్మీయంగా పలుకరించారు. చలంచర్ల సుస్మితకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద వితంతు పింఛన్ నగదును ఆయన స్వయంగా అందజేశారు. టిటిసి చదివిన సుస్మితకు డీఎస్సీలో ఉద్యోగం కోసం ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని సీఎం హామీ ఇచ్చారు. సుస్మిత కుమార్తె అయిదేళ్ళ చిన్నారి చేత్రికని గురుకుల పాఠశాలలో చేర్పించి ఉచితంగా చదువు చెప్పించే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. అదేవిధంగా పేద కుటుంబంలోని అంకోజి-సుమ కుమారుడికి వ్యవసాయ రంగంలో డ్రోన్‌లకు సంబంధించిన శిక్షణ ఇచ్చి, ఆ శిక్షణతో ఉపాధి చూపిస్తామని సీఎం చెప్పారు. ఇలా అందరికీ అండగా నేనున్నానంటూ ప్రజల్లో ఉత్సాహం కల్పించారు. అందరితో సంతోషంగా సెల్ఫీలు, ఫోటోలు దిగారు. సిఎం రాకతో ఊరు ఊరంతా సందడి నెలకొంది.

రాష్టవ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఇల ఏర్పాటుకు ఇక్కడినుంచే శ్రీకారం చుడుతున్నామని ఆయన చెప్పారు. నారంపేట ఎస్ఎంఎంఇ పార్కును ప్రత్యక్షంగానూ వర్చువల్‌గా కూడా ప్రారంభించారు. అనంతరం స్థానికులతో కలసి 'ప్రజావేదిక' సభలో పాల్గొన్నారు. గ్రామస్తుల సమస్యలను ముఖాముఖీ తెలుసుకున్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.

# వివాహ స్వర్ణోత్సవ సంబరం



ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి - గీతాలతమ్మ దంపతులై 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారి వివాహ స్వర్ణోత్సవ వార్షికోత్సవ సంబరం ఏప్రిల్ 30వ తేదీ రాత్రి చెన్నైలోని పార్క్ హయత్ హోటల్‌లో ఆత్మీయంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జనసేన నాయకుడు, మాగుంట కుటుంబసభ్యుడు చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి-గీతాలత దంపతులను అభినందించారు. మాగుంట శీనయ్య దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# 379 కోట్లతో.. జడ్పీ బడ్జెట్

## చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ




ఎట్టకేలకు జడ్పీ బడ్జెట్ ఒక కొలిక్కి వచ్చింది. నెల్లూరుజిల్లా పరిషత్ 2025-26 సంవత్సరానికి సుమారు 379 కోట్ల రూపాయలతో బడ్జెట్ ఆమోదించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నేతృత్వంలో బుధవారం జరిగిన సమావేశంలో బడ్జెట్‌కు గ్రీన్ సిగ్నల్ తెలిపారు. అనంతరం ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, జిల్లాలో ఈ మండు వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఆమె ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. కావలి కాలువ మరమ్మత్తు పనులు, చింతారెడ్డిపాలెం వద్ద అండర్ పాస్ నిర్మాణం, జల్ జీవన్ మిషన్ పనులు, జెడ్పి గ్రాంట్ నిధులతో చేసే అభివృద్ధి పనుల శంఖుస్థాపనకు జడ్పీ చైర్‌పర్సన్, జెడ్పిటిసి సభ్యులను ఆహ్వానించకపోవడం, పెండింగ్‌లో ఉన్న జెడ్పిటిసి సభ్యుల గౌరవ వేతనం వంటి సమస్యలను సభ్యులు ఈ సమావేశంలో ప్రస్తావించారు. ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించేవిధంగా అన్ని శాఖల అధికారులకు తెలియజేస్తామని ఈ సందర్భంగా డీఆర్ఓ తెలిపారు. శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కావలి శాసనసభ్యులు కృష్ణారెడ్డి, డిఆర్ఓ ఉదయభాస్కర్, జడ్పీ సీఇఓ విద్యారమ పాల్గొన్నారు.

# నెల్లూరులో 'DSR ఇన్‌ఫ్రా' 30 అంతస్తుల మేడ!




మహా నగరాలకి ధీటుగా నేను సైతం అంటూ నెల్లూరు ఎదుగుతోంది. నగరంలో ప్రప్రథమంగా 30 అంతస్తుల అపార్ట్‌మెంట్ భవనం నిర్మితం కాబోతోంది. హైదరాబాదు, బెంగుళూరు వంటి నగరాలలో తమ నిర్మాణాలతో ప్రఖ్యాతిగాంచిన నెల్లూరీయుల సంస్థ "DSR ఇన్‌ఫ్రా" తమ సొంత జిల్లా నెల్లూరులో ప్రతిష్టాత్మక నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జిల్లాలో ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలని నిర్వహిస్తోన్న దేవిరెడ్డి సుధాకరరెడ్డి కుటుంబం తొలిసారిగా తాము పుట్టిన గడ్డపై వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించబోతోంది. నగరంలోని నాలుగు లైన్ల జాతీయ రహదారిపై "DSR ది వన్" పేరుతో 30 అంతస్తుల అధునాతన అపార్ట్‌మెంట్ సముదాయ నిర్మాణాన్ని చేపట్టింది.

మొత్తం 90 ఫ్లాట్లు కలిగిన ఈ అపార్ట్‌మెంట్ భవనం రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మితం కాబోతోంది. నివాసితులు సౌకర్యం కోసం 20వేల చదరపు అడుగులలో "ది వన్ క్లబ్" పేరుతో క్లబ్‌హౌస్ ఏర్పాటు చేయనున్నారు. స్విమ్మింగ్‌పూల్, ఇండోర్ జిమ్, బ్యాట్మింటన్ కోర్టు, వెల్నెస్ స్పా, క్రీడా ప్రాంగణం, బాస్కెట్‌బాల్ కోర్ట్, పికిల్ బాల్ కోర్టుతో సహా 20కి పైగా ఆధునిక వసతులని అదనంగా అందుబాటులోకి తేనున్నారు. ఏప్రిల్ 30వ తేదీ ఉదయం ఈ నిర్మాణానికి చెందిన బ్రోచర్ విడుదల చేసి ప్రాజెక్టుని అధికారికంగా లాంచ్ చేశారు. మెట్రో పాలిటిన్, కాస్మో పాలిటిన్ సిటీలకే పరిమితమైన బహుళ అంతస్తుల నిర్మాణాలు నెల్లూరుకి కూడా వస్తుండడం శుభదాయకం!

# మేడే సంబరాలు.. ఎర్రజెండాల రెపరెపలు



'మేడే వర్ధిల్లాలి..కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ, మేడే రోజైన గురువారం నాడు నెల్లూరు నగరంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున సభలు, ర్యాలీలు జరిగాయి. నగరంలోని ప్రధాన కూడళ్లలో పార్టీ పతాకాలు ఆవిష్కరించి, నాయకులు మేడే విశిష్టతను ప్రజలకు తెలియజేశారు. కమ్యూనిస్టుయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జయంతి కూడా మే 1నే కావడంతో, మేడేని మరింత సంతోషంగా జరుపుకున్నారు. స్థానిక కనకమహల్ కూడలి వద్దనున్న సుందరయ్య విగ్రహం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం జిల్లా శాఖ కార్యదర్శి మూలం రమేష్, సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, నాయకులు కత్తి శ్రీనివాసులు, పెంచలనరసయ్య, కట్టా సతీష్, సీఐటియు నాయకులు కటారి అజయ్‌కుమార్, రైతు సంఘం నాయకులు పులిగండ్ల శ్రీనివాసులు, మహిళా సంఘం నాయకురాలు షేక్ మస్తాన్‌బీ తదితరులు పాల్గొని మేడే సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మికుల చట్టాలను తుంగలో తొక్కి, కేంద్రం కార్పొరేట్ శక్తులకు వంతపాడుతోందని విమర్శించారు. సమస్యల సాధనకు పోరుబాట పట్టాలన్నారు. కార్మికులు ఐక్యంగా ఉంటూ సమస్యల పరిష్కారాన్ని సాధించుకోవాలని, 'పోరాడితే పోయేదేమీ లేదు..బానిస సంకెళ్ళు తప్ప' అంటూ ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా వారు నినదిస్తూ, నాయకులు కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. సమస్యల సాధనలో భాగంగా మే 20న సీపీఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నామని, అన్నివర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మేడే సందర్భంగా, నగరంలో పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. పేదలకు అన్నదానం నిర్వహించారు.

లాయర్
మే 02, 2025

# మసకబారిపోతున్న..తెలుగు వెలుగు!

'అమ్మ భాష' అద్వితీయమని, అమృతప్రాయమని అందరికీ తెలిసిందే. మాతృభాషను నిర్లక్ష్యం చేయకూడదని, అది జలజలపారే జలపాతంలా ఎప్పటికీ కొనసాగుతూనే ఉండాలి తప్ప, మృతభాష కాకూడదని పెద్దలందరూ పదేపదే చెప్తూనే ఉన్నారు. కానీ, నేటి ఆధునిక కాలంలో ఆదరణ కరువై, క్రమేణా మన తెలుగుభాష మసకబారిపోతోంది. అమ్మ ఉగ్గుపాలతో నేర్చే భాష నిజంగానే అమృతం వంటిది. దానిని అలా వృద్ధి చేసుకుని, భాషాపరంగా.. మన సంస్కృతి సంప్రదాయాల పరంగా మరింత ఉన్నతంగా ఎదగాలి. కానీ క్రమేణా తెలుగుభాష అనాదరణకే గురవుతుండడం విచారకరం. వాస్తవానికి తెలుగు భాషకెంతో ఘనమైన చరిత్ర ఉంది. వెయ్యేళ్ళకు పూర్వం నుంచీ తెలుగు భాష ఉంది. రాజుల కాలంలో కూడా మన భాషకు, తెలుగు సాహిత్యానికీ ఎనలేని ప్రాధాన్యత ఉండేది. ప్రపంచవ్యాప్తంగా పేరెన్నికగన్న భాషల్లో తెలుగు ఒకటి. మన రాష్ట్రంలోనే కాక దేశవిదేశాల్లో కూడా తెలుగు మాట్లాడేవారు కొల్లలుగానే ఉన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో కూడా అనేకమంది తెలుగు మాట్లాడుతుంటారు. చిన్నతనం నుంచి తెలుగు భాషను నేర్చుకునే తెలుగుబాలలకు మానసిక వికాసంతో పాటు, మెదడు ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుందని తెలుగు భాషలోని అక్షరాలు, ఉచ్ఛారణల వల్ల జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు. తెలుగులో ప్రావీణ్యం సంపాదించడం వల్ల భాషా సామర్థ్యాలు విస్తరిస్తాయి. చదువుకోవాలే కానీ, మన తెలుగులో ఎన్నో ప్రాచీనమైన శాస్త్రాలు, గ్రంథాలకు కొదవే లేదు. అయినా, మన ఆంధ్రరాష్ట్రంలో మాత్రం తెలుగుభాషకు సరైన ప్రోత్సాహం ఉండడం లేదు. ముఖ్యంగా అమ్మఒడి వద్ద నుంచి బడికి వచ్చే చిన్నతనం లోనూ, ఆ తర్వాత పాఠశాల స్థాయిలోనూ కూడా తెలుగు పట్ల చిన్నచూపే కనబడుతోంది. గతంలో తెలుగు అయ్యవార్లు తెలుగుభాషతో పాటు, విద్యార్థులను సన్మార్గంలో పెట్టేందుకు పురాణ గ్రంథాల్లోని ఎన్నో విశేషాలను ఎంతో ఆసక్తిగా చెప్పేవారు. నీతిపద్యాలకు కొదవే ఉండేది కాదు. ఇప్పుడలాంటివన్నీ చెప్పేవారు కానీ, వినేవారు కానీ ఉండడం లేదంటే అతిశయోక్తి కాదు. పుస్తకాలన్నవి మానసిక వికాసానికి దారిదీపాలు. అపూర్వమైన జ్ఞానాన్నిచ్చే కల్పతరువులు. అందుకే పాత కాలంలో పుస్తకాలంటే ఎంతో ఇష్టపడేవారు. పుస్తకాలను సరస్వతిదేవి ప్రతిరూపంగా చూసుకునేవారు. ప్రతి ఇంటా కూడా పుస్తకాల అరలు కూడా ఉండేవి. భాషా పరిజ్ఞానానికి పుస్తకాలను చదువుకోవడం అన్నది చదువర్లకు ఒక అలవాటుగా ఉండేది. ఇప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా అందరికీ అందుబాటులో ఎన్నో గ్రంథాలయాలున్నా, ఏదో ఒక సమయంలో అక్కడికి వెళ్ళి పుస్తకాలు చదువుకునేవారు అరుదైపోతున్నారు. రానురాను సాహిత్యానికి కూడా పెద్దగా ఆదరణ ఉండడం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే, సెల్‌ఫోన్ల కాలం వచ్చేశాక, తెలుగునాట కూడా పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. 'నెట్'లో అన్నీ ఉంటాయి కదా, ఇళ్లలో పుస్తకాలు పేర్చుకోవడం ఎందుకనే భావన కూడా వచ్చేసింది. గురువులు చెప్పే మాటల కంటే గూగుల్ మాటలకే ప్రాధాన్యత పెరిగిపోయింది. పాఠశాలల్లో విద్యార్థులే కాదు ఉపాధ్యాయులు కూడా సెల్‌ఫోన్ల మోజులోనే పడిపోతున్నారు. చిన్నతనం నుంచి పిల్లలకు తెలుగు భాష పట్ల మమకారం ఉండే విధంగా తయారు చేయాల్సిన పెద్దలు కూడా అనేకమంది తెలుగుపై నిర్లక్ష్యంగానే ఉంటున్నారు. దీంతో మన విద్యార్థులు తెలుగు పదాలను కూడా సరిగా రాయలేని, చదవలేని పరిస్థితి దాపురిస్తోంది. అయినా, ఎవరు ఏ భాషనైనా హాయిగా నేర్చుకోవచ్చు. అందులో ఎవరికీ అభ్యంతరం ఉండనక్కర లేదు. కానీ, తెలుగువారమై ఉండి, తెలుగునే సక్రమం రాయడం లేదా చదవడం కూడా రాకపోతే ఎలా?..ఇతర భాషలపై మక్కువ ఉన్నా, అసలు మాతృభాషనే విస్మరించడం దారుణం కదా!.. అందరూ ఆలోచించాల్సిన విషయమిది. మరోవైపు, చెప్పుకోవడానికి తెలుగు అధికారభాషగా ఉంది కానీ, తెలుగుభాషను అన్ని స్థాయిల్లో అమలుచేసే యంత్రాంగం మాత్రం నేటికీ లేదు. ప్రభుత్వ శాఖల్లో తప్పనిసరిగా తెలుగు అమలు చేస్తామంటారు కానీ, ఏళ్ళతరబడిగా అన్నీ కంటితుడుపు మాటలే. ఇప్పటికైనా మన ప్రభుత్వాలు తెలుగుభాష పట్ల శ్రద్ధ తీసుకోవాలి. కమ్మనైన మన అమ్మభాష కనుమరుగైపోకుండా.. తెలుగుకు తిరిగి వెలుగు వచ్చేందుకు ప్రభుత్వాలతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రతిఒక్కరూ ఎవరి వంతు కృషి వారు చేయాలి.




## గడ్డి కూడా దొరకని గడ్డు కాలం

# సవాలుగా మారిన పశుపోషణ

ఎండాకాలం వచ్చిందంటే చాలు.. మనుషులకే కాదు, పశుపక్ష్యాదులకు కూడా కష్టకాలమే. అందులోనూ ఈ మండే ఎండల్లో మూగజీవాలు పడే బాధలు వర్ణనాతీతం. ముఖ్యంగా, మనుషులకు జీవనాధారంగా ఉంటున్న పశువులకు తినడానికి మేత, తాగడానికి నీళ్ళు కూడా దొరకని గడ్డు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో పశుపోషణ, పశు సంరక్షణ అన్నవి రైతులకు పెద్ద సవాల్‌గా మారుతున్నాయి. పాడిపంటలకు లోటులేని మన భారతదేశంలో, అన్నానికి కొదవలేని అన్నపూర్ణ వంటి మన ఆంధ్రరాష్ట్రంలో కూడా ఏటా పాడిరైతులకు ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. వ్యవసాయం తర్వాత రైతాంగానికి జీవనాధారం పాడిపశువులే. పంట పొలాలు లేని సామాన్యులకు కూడా ఇవి ఆదరువుగా ఉంటాయి. పట్టణాలు, నగరాల్లో ఇళ్ళలోనే ఒకటిరెండు ఆవుల్నో, గేదెల్నో పెంచుకుని పాలు పెరుగు అమ్ముకుంటూ పొట్టపోసుకునేవారు మనదేశంలో కొల్లలుగానే ఉన్నారు. ప్రస్తుతం దాణా ధరలు ఆకాశానికంటుతుండడంతో, వాటి పోషణ వ్యయం పెనుభారమవుతోంది. పశువుల దాణాలు, పశువుల మందులు వంటివి మార్కెట్‌లో బడా వ్యాపారులకు లాభాలు తెస్తున్నాయే కానీ, రైతులకు అప్పులనే మిగిలిస్తున్నాయి. ఒకవేళ డబ్బుపెట్టి కొందామన్నా, పశువులకు ఎండుగడ్డి తప్ప, పచ్చిమేత దొరక్కపోతుండడంతో పాడిరైతులు, వాటి పెంపకందారులు క్రమేణా బక్కచిక్కిపోతున్న తమ పశువులను చూసి ఆవేదన చెందుతున్నారు. ఎండా కాలం వచ్చిందంటే దేశంలోని ప్రతిచోటా ప్రతి ఏటా ఇదే పరిస్థితి!

### ఆకాశాన్నంటిన గడ్డి ధర..!

గ్రామీణ ప్రాంతాల్లో గతంలో పచ్చికబయళ్లు విస్తారంగా ఉండేవి. కాలువ గట్లు, నదులు, చెరువులు, పొలాల వద్ద పచ్చిగడ్డి పుష్కలంగా దొరికేది. పశువుల మేతకు ఎలాంటి ఇబ్బందీ ఉండేదికాదు. కాలక్రమంలో అవన్నీ కనుమరుగైపోతున్నాయి. ఎక్కడ కాస్త స్థలం ఉన్నా అమ్మేసుకుని ఇతరత్రా వ్యాపారాలు చేసుకుంటున్నారే తప్ప, వ్యవసాయానికి కానీ, గడ్డిని మొలిపించే వ్యవసాయక్షేత్రాలకి గానీ స్థలాలు కేటాయించే వారు లేరు. ప్రభుత్వాలు ఎన్ని విధాల రాయితీలు ఇస్తున్నా, పశువులకు అవసరమయ్యే గడ్డిని పెంచే రైతులు మాత్రం తక్కువే. ఈ మండుటెండల్లో ఎక్కడ చూసినా ఎండు టాకులు తప్ప, పచ్చిగడ్డి కనిపించే పరిస్థితే లేదు. పోనీ, మార్కెట్లో దొరికే దాణా తెచ్చి వేద్దామన్నా, వాటిలో పోషకాలు నామమాత్రంగానే ఉంటున్నాయన్నది రైతుల ఆవేదన. దీంతో అనేకమంది పాడిపరిశ్రమ పట్ల విరక్తి పెంచుకుంటున్నారు.

మార్కెట్లో పచ్చగడ్డి ఎటూ దొరకదు. పోనీ ఆకలితో అల్లాడే పశువుల ప్రాణం నిలిపేందుకు ఎండుగడ్డిని కొందామన్నా, వాటి ధరలు కూడా తక్కువేమీ ఉండడం లేదు. ఓ ట్రాక్టర్ లోడు ఎండు గడ్డి కనీసం 20 నుంచి 25వేల రూపాయల దాకా ధర పలుకుతోంది. అంతంత మొత్తం వెచ్చించి పశువులను పోషించుకోవాలంటే సామాన్య రైతులకు సాధ్యమయ్యే పనికాదు. ప్రభుత్వాల నుంచి సైతం పాడి పరిశ్రమకి ఆశించిన స్థాయిలో సహకారం, ప్రోత్సాహం లేకపోవడంతో, అనేకప్రాంతాల్లోని రైతులు క్రమేణా పశువుల పెంపకానికి దూరమవుతున్నారు.

ప్రస్తుత ఆధునిక కాలంలో, వరిగడ్డిని యంత్రాలతో కోసి చుట్టలు చుట్టేస్తుండడంతో ఎండుగడ్డి ఆశించిన స్థాయిలో రావడం లేదని, ఆ 'చుట్టల గడ్డి'ని కూడా పశువులు ఇష్టంగా తినడం లేదని రైతన్నలు వాపోతున్నారు. ప్రభుత్వాలు ఈ సమస్యలపై దృష్టిపెట్టి, ప్రతి గ్రామంలో తప్పనిసరిగా శాశ్వత ప్రాతిపదికపై ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేయాలి. ఆయా గ్రామాల్లోని పశువులకు అవసరమైన పచ్చగడ్డిని, ఇతరత్రా మేతను ఉత్పత్తిచేసి చౌకధరలకు అందుబాటులోకి తేవాలి. అలాచేస్తే తప్ప ఈ సమస్యలు తీరవని రైతులు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా, గ్రామాల్లో నీటితొట్టెలు విరివిగా ఏర్పాటుచేసి ఈ వేసవికాలంలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు కూడా కృషిచేయాలని వారు కోరుతున్నారు.

### అందని పశువైద్యం.. మందులు సైతం మృగ్యం! ..

సరైన పోషణ లేక, శుభ్రమైన నీళ్ళు దొరక్క, బక్కచిక్కిపోతున్న పశువులు నానా రకాల రోగాల బారినపడుతున్నాయి. కొన్ని పట్టణాలు, నగరాల్లో పశువుల యజమానులు కొంతమంది వాటిని నిర్లక్ష్యంగా వీధుల్లోకి వదిలేయడంతో, అవి మురుగు గుంటల వద్ద పడేసిన చెత్తాచెదారాన్ని ప్లాస్టిక్ కవర్లని తింటున్నాయి. మురుగునీళ్ళు తాగుతున్నాయి. దాని ఫలితంగా రకరకాల వ్యాధుల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నాయి. దేశంలో కోట్ల సంఖ్యలో పశువులున్నా, వాటికి అవసరమైన వైద్యం అందించే పశువైద్యశాలలు మాత్రం లేవు. కొన్నిచోట్ల అవి వున్నా వాటిలో వైద్యులుండరు, మందులు అసలే ఉండవు. దేశంలో పశువుల వైద్యుల కొరత తీవ్రంగా వుంది. వాటి భర్తీకి ప్రభుత్వాల నుంచి చర్యలు మాత్రం శూన్యం. పాడిపరిశ్రమ కళకళలాడాలంటే ముందు ఈ దుస్థితులు తొలగిపోవాలి. పశువులు కదా, గాలికి బతికేస్తాయిలే అని వాటి సమస్యలను కూడా గాలికే వదిలేయడం ఎంతమాత్రం సమంజసం కాదు. అన్నిప్రాంతాల్లో ఉన్న పశువులకు మేత, నీళ్ళు, వైద్యం వంటివి కొరత లేకుండా అందించేందుకు సంబంధిత అధికార వ్యవస్థల ద్వారా చర్యలు చేపట్టాలి. కేవలం ప్రభుత్వాలే కాదు దాతలు, స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులు, మానవతా హృదయులు, జంతు ప్రేమికులు అందరూ కలసి వాటి పోషణకి, రక్షణకి చేయగలిగింది చేయాలి. మనతోపాటు కలసి ఉంటూ, కేవలం గడ్డిని మాత్రమే తిని, మనకీ, మన బిడ్డలకీ అమృతం లాంటి పాలిచ్చే గోమాతలను, వ్యవసాయానికి ఊతంగా నిలిచే మూగజీవాలను నిర్దయగా, వాటి ఖర్మాన వాటిని వదిలేయడం సబబు కాదు. పశు పక్ష్యాదులని కూడా మనలో భాగంగా భావించి వాటి సంరక్షణ దిశగా మానవ సమాజం మానవతా హృదయంతో శ్రద్ధ చూపాలి..! - రాజశ్రీ

# ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి!




ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి అత్యంత విషాదకరం, హృదయ విదారకం. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఎవరికైనా ఇలాంటి ఆలోచన కూడా పుట్టకుండా ఉండేలా ఉగ్రవాదులకి పుట్టగతులు లేకుండా చేయాలి. రెండేళ్ళ పసిబిడ్డని చూపించి తన భర్తని వదిలేయమని అడిగినా పాపభీతి లేకుండా ఆ ఇంటి పెద్దని పొట్టన పెట్టుకున్నారు. ఆ అభాగ్యురాలిని విధవని చేశారు. రెండేళ్ళ పసికూనకి తండ్రిని లేకుండా చేశారు. పైగా "జాకే తుమారా మోడీకు బోల్డో" (వెళ్ళి మీ మోడీకి చెప్పుకో) అని చెప్తూ నిర్దాక్షిణ్యంగా కాల్చేశారు. ఇలా 26 మందిని పొట్టన బెట్టుకున్న కిరాతకులకి తగిన గుణపాఠం చెప్పాలి. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదాలతో అణిచేయాలి, కూకటి వేళ్ళతో సహా పీకేయాలి. ఇలా చేయడానికి ఇదే సరైన సమయం. భారతదేశాన్ని అభివృద్ధివైపు నడిపిస్తున్న నరేంద్ర మోడీ లాంటి ధీరోదాత్త నాయకుడికే ఇది సాధ్యం. యావత్ భారతావని ఆయనకి తోడుగా నిలుస్తుంది. ఉగ్రవాదం అణిచివేత దిశగా మోడీ ఎలాంటి చర్యలు తీసుకున్నా సమర్థిస్తుంది. శత్రు దేశంతో యుద్ధం వచ్చినా స్వాగతిస్తుంది. అదే భారతదేశ గొప్పదనం. 'మేరా భారత్ మహాన్.'

లక్ష్మీభరద్వాజ్ - హైదరాబాదు.

### దేవుళ్ళకి... రాజకీయం అంటిస్తున్నారు!

గత వారం మన 'లాయర్'లో రాసింది అక్షరాలా నిజం. మన రాజకీయ నాయకులు వాళ్ళ స్వార్థ ప్రయోజనాల కోసం దేవుళ్ళని, దేవాలయాలని రాజకీయాలకి వాడుకుంటున్నారు. అనవసరమైన వివాదాలతో దైవ స్థానాలని రాజకీయాలలోకి లాగుతున్నారు. అతి పవిత్రమైన పుణ్యక్షేత్రాలకి రాజకీయ మలినం అంటిస్తున్నారు. ఇప్పటికే కులరాజకీయాలతో సమాజంలో విద్వేషాలు సృష్టించారు. ఇప్పుడు మతాలని కూడా వాడుకోవాలని చూస్తున్నారు. ఇది ఏ పార్టీ వారు చేసినా తప్పే. రాజకీయ నేతలు ఇలాంటి దుష్ప్రయోగాలు మానుకుంటే మంచిది. ఈ సంస్కృతి మితిమీరితే ప్రజలే బుద్ధి చెప్తారు.

డి.వాసుదేవశర్మ - కావలి.

# నగరంలో టెర్రిఫిక్‌గా మారిన ట్రాఫిక్

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ అధ్వాన్నంగా మారింది. ముఖ్యంగా పార్కింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారయ్యింది. ఆటోలు, సిటీ బస్సుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. బస్సులు, ఆటోలు ఎక్కడపడితే అక్కడ రోడ్డుకి అడ్డంగా ఆపేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు అక్కడేవున్నా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఇక పార్కింగ్ విషయమైతే చెప్పనవసరం లేదు. ఎవడిష్టం వాడిదే. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక పోలీసు విభాగమే ఉంది. కానీ, ఆ విభాగం పనిచేస్తోందా.. లేదా..? అన్న అనుమానం కలిగేలా నగర ట్రాఫిక్ ప్రజలకి నరకం చూపిస్తోంది. పోలీసు ఉన్నతాధికారులు పట్టించుకుని టెర్రిఫిక్‌గా మారిన నగర ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించవలసిందిగా కోరుతున్నాను.

వి.వి.సురేష్‌బాబు - గాంధీనగర్, నెల్లూరు.

### ఉగ్ర ముష్కరులపై..

# వెల్లువెత్తుతున్న నిరసనలు

## ఉగ్రవాదాన్ని అంతమొందించాలంటూ ప్రదర్శనలు

## జిల్లావ్యాప్తంగా పెల్లుబికిన ఆందోళనలు



**కశ్మీర్**లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర పిశాచాలు ఇటీవల తుపాకులతో దాడిచేసి 26 మందిని పొట్టనబెట్టుకోవడంపై నెల్లూరుజిల్లాలో సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మానవత్వం అన్నది ఏ కోశానా లేని నరరూప రాక్షసులైన ఉగ్రవాదులను మట్టుపెట్టాలని, అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న ఆ ఉగ్రవాద విషసర్పాలను అంతమొందించాలని, ప్రత్యేకంచి మతోన్మాదంతో హిందువులను కాల్చిచంపిన ముష్కరులపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ప్రజలు, అనేక సంఘాల వారు ముక్తకంఠంతో కోరుతున్నారు. దేశప్రజల పాలిట పెనుముప్పుగా తయారైన ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో అణచివేయాలని ప్రజలు కేంద్రప్రభుత్వాన్ని కోరుతున్నారు. జిల్లావ్యాప్తంగా అనేక ప్రజాసంఘాలు, రాజకీయాలకు అతీతంగా పలు పార్టీల నాయకులు, మానవతావాదులు, యువత ఈ నిరసన ప్రదర్శనల్లో పాల్గొని, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు. ఉగ్రవాదుల తుపాకీగుళ్ళకు బలైనవారికి నివాళులర్పిస్తూ, కొవ్వొత్తులు వెలిగించి వారికి అంజలి ఘటించారు. భవిష్యత్తులో భారత్‌వైపు కన్నెత్తిచూడాలంటేనే భయపడేవిధంగా పాక్ ఉగ్రవాదులు, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను కేంద్రప్రభుత్వంకఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### నెల్లూరులో పెల్లుబికిన ఆగ్రహం



కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిపై నెల్లూరు నగరంలో ఆగ్రహం పెల్లుబుకింది. ఈనెల 25న బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఉగ్రవాదుల అమానుషాలను ఖండిస్తూ నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరీ ఎం.సుందరయ్యయాదవ్ ఆధ్వర్యంలో అనేకమంది న్యాయవాదులు పాల్గొని, ఉగ్రదాడులకు బలైనవారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఉగ్రవాదుల పట్ల కేంద్రం కఠినవైఖరితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు నెల్లూరు నగరంలోని జనసేన నాయకులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జునయాదవ్ తదితరుల ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్ద పెద్దఎత్తున మానవహారం ఏర్పాటుచేసి, ఉగ్రవాదుల దుర్మార్గాలను ఖండించారు. ఉగ్ర ముష్కరులు నశించాలంటూ నినాదాలు చేశారు. అమాయకులను బలితీసుకుంటున్న ఉగ్రవాదులను తరిమికొట్టాలంటూ ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నాయకుడు మన్నేపల్లి పెంచలరావు ఆధ్వర్యంలో ఈనెల 25న నిరసన ప్రదర్శన జరిగింది. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు గాదిరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### మైపాడులో యువత మానవహారం :

దేశప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్న ఉగ్రరాకాసిమూకలను ఏరివేయాలని, కశ్మీర్‌లో ఉగ్రదాడులతో పర్యాటకులను కాల్చిచంపిన పాకిస్థాన్ ఉగ్రవాదులను శిక్షించాలంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఈనెల 26న ఇందుకూరుపేట మండలం మైపాడులోని యువత మానవహారం చేపట్టారు. ఇది ఒక్క పర్యాటకులకే కాదు, భారత ప్రజలందరిపై జరిగిన దాడిగా భావిస్తున్నామని, ఉగ్రవాదులు ఎక్కడున్నా పట్టుకుని, ఆ నరహంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### కావలిలో యుటిఎఫ్ ఆందోళన :

కశ్మీర్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదులు జరిపిన దాడి దారుణమంటూ కావలిలో ఏప్రిల్ 26న ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన కావలి డివిజన్‌లోని అన్ని మండలాల యుటిఎఫ్ శాఖల వారు పాల్గొని ఉగ్రదాడులపై తీవ్రంగా మండిపడ్డారు. ఉగ్రవాదుల దాడిలో అమరులైన భరత మాత బిడ్డలకు ఆత్మశాంతిని ప్రసాదించాలంటూ భగవంతుని ప్రార్థించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, రాష్ట్రశాఖ ఆడిట్ కమిటీ సభ్యురాలు బి.శ్రీదేవి, జిల్లా కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్ సిఆర్‌ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### బిట్రగుంటలో సీపీఎం నిరసన :

ఉగ్రదాడులను నిరసిస్తూ బోగోలు మండలం బిట్రగుంటలో ఏప్రిల్ 26న సీపీఎం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించి, ఉగ్రవాదాన్ని ప్రభుత్వం కూకటివేళ్లతో సహా పెకలించి వేయాలన్నారు. ఈ దాడుల్లో బలైన వారి కుటుంబాలను ప్రభుత్వాలు అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. సీపీఎం కావలి డివిజన్ నాయకుడు తుమ్మల వెంకయ్య, సీఐటీయు మండల కార్యదర్శి చల్లా నరహరి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### బుచ్చిలో కొవ్వొత్తుల ర్యాలీ



ఉగ్ర పిశాచాల మారణకాండకు నిరసనగా బుచ్చిరెడ్డిపాళెంలోని వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 25న కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఉగ్రవాదుల పాశవికత్వాన్ని వారు ఖండించారు. దొంగచాటుగా వచ్చి అమాయకులైన పర్యాటకులను చంపడం ఉగ్రవాదుల రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. ఉగ్రవాదుల నిర్మూలనకు కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మాలేపాటి రవికుమార్, కార్యదర్శి విశ్వనాథ్, కోశాధికారి కిషోర్‌బాబు, సీనియర్ నాయకుడు తిరువీధి రాధాకృష్ణయ్య, సొల్లేటి ప్రభాకర్, కారంశెట్టి ప్రసాద్, గాదంశెట్టి శ్రీనివాసులు, బి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### సీతారామపురంలో ర్యాలీ :

జిల్లాలోని సీతారామపురంలో ఏప్రిల్ 26న పెద్దఎత్తున జరిగిన ప్రదర్శనలో రాజకీయాలకు అతీతంగా అనేకమంది నాయకులు, ప్రజలు పాల్గొని, ఉగ్రదాడులు అమానుషమని, అత్యంత పాశవికమైన వారి చర్యలు మానవత్వానికే మాయనిమచ్చ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మండల కో-ఆర్డినేటర్ చింతల శ్రీను, వి.వెంకటేశ్వర్లు, జి.చంద్రారెడ్డి, ప్రవీణ్, వికాస్ బాబు, రమేష్‌జీఖ, కరుణాకర్‌రెడ్డి, దళిత నాయకుడు కలవెల ఎలీషాకుమార్, జనసేన నాయకుడు బోగినేని కాశి రత్తయ్య, జాషువా తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మకూరులో ఆందోళన

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులు దారుణమని ఆత్మకూరు బీజేపీ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి అన్నారు. ఉగ్రదాడులకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో ఇటీవల ఆందోళన నిర్వహించారు. బీజేపీతో పాటు పలుపార్టీల నాయకులు కూడా పాల్గొని, ఆత్మకూరు పట్టణంలో మానవహారం ఏర్పాటుచేసి, ఉగ్రవాదుల దుశ్చర్యల పట్ల నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు కె.మల్లికార్జునరెడ్డి, సంతోష్‌కుమార్, టీడీపీ పట్టణాధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ఆపస్ నాయకులు మల్లవరపు అశోక్‌రెడ్డి, అనిల్‌కుమార్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### మధుసూదన్ కుటుంబానికి

# రూ.10 లక్షల సాయం

కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల తుపాకీతూటాలకు బలైపోయిన నెల్లూరుజిల్లా కావలి పట్టణానికి చెందిన మధుసూదన్ కుటుంబసభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 లక్షలను తనవంతు సాయంగా అందజేసింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలసి ఏప్రిల్26న కావలిలోని మధుసూదన్ ఇంటికి వెళ్ళి, వారు ఆ చెక్కును అందజేశారు. మధుసూదన్ ఉగ్రవాదుల దాష్టీకానికి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లితండ్రులకు సాయంగా ఉందామని, విదేశాల్లో ఉన్నత ఉద్యోగం సైతం వదులుకుని వచ్చిన మధుసూదన్ మృతి ఆవేదన కలిగిస్తోందన్నారు. తొలుత, మధుసూదన్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేంద్రప్రభుత్వం తరఫున వారికి పరిహారం, ఇతరత్రా సదుపాయాలను కూడా త్వరలోనే అందజేస్తామన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించే విషయంలో భారత ప్రధాని నరేంద్రమోడీ తీసుకుంటున్న చర్యలకు తామంతా కట్టుబడి ఉన్నామన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు భారతీయులందరూ ఏకం కావాలని వారు కోరారు.

# పాక్..భారీ మూల్యం చెల్లించక తప్పదు

### రాష్ట్రప్రభుత్వ సలహాదారు డా. సతీష్‌రెడ్డి



ఉగ్రవాద దుశ్చర్యలకు పాల్పడుతున్న పాకిస్థాన్ భారీ మూల్యం చెల్లించక తప్పదని డీఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సలహాదారు డాక్టర్ జి. సతీష్‌రెడ్డి హెచ్చరించారు. కశ్మీర్‌లో ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేసేందుకే ఉగ్రవాద ముష్కరమూకలు పర్యాటకులపై దాడికి పాల్పడ్డాయన్నారు. ఉగ్రవాదానికి వంత పాడుతున్న పాకిస్థాన్ ఆగడాలను ఎదుర్కొనే సత్తా భారత రక్షణ దళాలకు వుందన్నారు. ఇటీవల ఆయన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన కావలి వాసి మధుసూధన్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు సురేంద్రరెడ్డి, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలి

### టీడీపీ నేత రావి మోహన్‌చౌదరి



కశ్మీర్ యాత్రకు వెళ్ళిన పర్యాటకులను పాశవికంగా హతమార్చిన ఉగ్రవాదులకు కేంద్రం తగు గుణపాఠం చెప్పాలని తెలుగుదేశం పార్టీ కర్నాటక రాష్ట్ర కోఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి కోరారు. దశాబ్దాల తరబడి పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని, ఉగ్రదాడులతో దేశాన్ని భయాందోళనలకు గురిచేస్తున్న ఉగ్రవాదులను ఏరిపారేయాలన్నారు. ఉగ్రవాదులను అణచివేసే వివయంలో ప్రధాని నరేంద్రమోడీ తీసుకునే చర్యలకు జాతి యావత్తూ మద్దతుగా ఉంటుందని, ప్రధాని నిర్ణయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సంపూర్ణ సంఘీభావం ప్రకటించారని ఆయన తెలిపారు. ఉగ్రదాడుల్లో 26 మంది పర్యాటకులు మరణించడం దారుణమంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# ఉగ్రభూతాన్ని అణిచేయాలి

ఉగ్రభూతాన్ని ఉక్కుపాదంతో అణిచేయాలని, మానవతావాదులందరూ ఏకమై పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాలని భారతీయ జనతాపార్టీ నమామి గంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ అన్నారు. ఇటీవల నగరంలోని మూలాపేట అలంకార్‌సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఉగ్రవాదుల దాడులను ఖండించారు. బీజేపీ నాయకులు పాల్గొని, పాక్ దుశ్చర్యలను కేంద్రం పూర్తిస్థాయిలో అడ్డుకోవాలని కోరారు.



# మరో ఆరుగురికి ట్రై సైకిళ్లు

నెల్లూరు జిల్లావ్యాప్తంగా వందలాదిమంది దివ్యాంగులకు తమ వంతు సాయం అందిస్తూ అందరినీ ఆదుకుంటున్న మహాదాత..నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. మరో 6 మంది దివ్యాంగులకు ఇటీవల నెల్లూరులోని తమ నివాసంలో ట్రై సైకిళ్లు అందించారు. నడవలేక అవస్థలు పడే ఏ ఒక్క దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందకుండా ఉండకూడదనే సదాశయం..సమాజసేవాభావంతో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే జిల్లావ్యాప్తంగా కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కోవూరు, కావలి నియోజకవర్గాల్లో వేలాదిమందికి ట్రై సైకిళ్లు అందిస్తున్నారు. అనివార్య కారణాలతో ట్రై సైకిళ్ళు అందుకోలేకపోయిన కావలి పట్టణంలోని బుడంగుంట, అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు, సోమశిల, సంగం మండలం తరుణవాయి గ్రామాలకు చెందిన 6 మంది దివ్యాంగులు నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విపిఆర్ నివాసంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేతులమీదుగా విద్యుత్ ట్రై సైకిళ్ళు అందుకుని, వేమిరెడ్డి సాయానికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో..

# గుడ్డ సంచులు పంపిణీ



ప్లాస్టిక్ వద్దు–గుడ్డ సంచులు ముద్దు అంటూ, నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 28న పర్యావరణ పరిరక్షణలో భాగంగా, ప్లాస్టిక్ బ్యాగ్‌లకు ప్రత్యామ్నాయంగా వాకర్స్‌కు, క్రీడాకారులకు సుమారు వెయ్యి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ కిలారి శ్రీనివాసులునాయుడు సారథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏడుగురు దాతలు కిలారి శ్రీనివాసులునాయుడు, జి. నారాయణరెడ్డి, మాగంటి ప్రసాద్, ఫ్రెండ్స్ వాకర్స్ మాజీ ప్రెసిడెంట్..203 డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వింజం రామానాయుడు, పులగల సుబ్బారావు, కొప్పు కోదండరామయ్య ఈ పంపిణీకి సహకరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఎస్కే నజీర్ అహ్మద్, బెల్లం చెంచయ్య, కె.శివయ్య, బి రామమోహన్‌రెడ్డి, టి. హరిబాబు, కొండూరు సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, కె రఘురాం ముదిరాజ్, ఎస్ రాఘవేంద్ర షెట్టి, ఏకొల్లు రాఘవరెడ్డి, సి.అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

### పేదరికం లేని..

# సమాజం కోసం కృషి చేద్దాం



### - కలెక్టర్ పిలుపు

పేదరికం లేని సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన మార్గదర్శి –బంగారు కుటుంబం పథకంలో ఆసక్తి ఉన్నవారు స్వచ్ఛంధంగా భాగస్వాములు కావచ్చని జిల్లా కలెక్టర్ ఆనంద్ చెప్పారు. ఇటీవల ఆయన ఆ పథకం గురించి టెలి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులలో అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో దాదాపు లక్ష కుటుంబాలు పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్‌లో సహాయం అవసరం ఉన్న కుటుంబాలుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, ధనికులు, సేవా భావం కలిగినవారు ఈ పథకంలో భాగస్వాములు కావచ్చని, జిల్లాలో ప్రతి శాఖ కనీసం 10 మందిని ఈ పథకంలో పేదవారికి సహకారం అందించే విధంగా భాగస్వాములయ్యేటట్లు అవగాహన కల్పించాలని చెప్పారు ఎవరినీ బలవంతంగా ఈ పథకంలో చేర్చవద్దని, ఇది కేవలం స్వచ్ఛంధ పథకమేనని అన్నారు.

# మత్స్యకారుల ఖాతాల్లో..రూ. 2447 కోట్లు

### - మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు వెల్లడి



జిల్లాలో 'మత్స్యకార సేవలో' పథకం ద్వారా 12239 మంది మత్స్యకారులకు రూ.24.47 కోట్లు నగదును ఏప్రిల్ 26న వారి బ్యాంకు ఖాతాలకు ముఖ్యమంత్రి జమచేసినట్లు జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం బీచ్‌నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 'మత్స్యకార సేవలో' ఈ పథకాన్ని ప్రారంభించగా, ఈ కార్యక్రమాన్ని నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార సంఘం నేతలు, మత్స్యకారులు వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, సముద్రంలో వేట సాగించే మత్స్యకారులకు వేటనిషేధ కాలం (ఏప్రిల్ 15 నుంచి 14 జూన్ వరకు) భృతిగా 20వేల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విడుదల చేశారని చెప్పారు. రెండునెలల వేటనిషేధ కాలంలో మత్స్యకారుల జీవనవిధానం దెబ్బతినకుండా వారికి ఆర్థిక భరోసా కల్పించాలన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలో సముద్రతీర ప్రాంత నియోజకవర్గాలైన కావలి, కోవూరు, సర్వేపల్లి, కందుకూరు నియోజకవర్గాల్లో అర్హులైన మత్స్యకారులకు రూ.20 వేలను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నట్లు చెప్పారు. కావలిలో 4778 మంది, కోవూరులో 3102 మంది, సర్వేపల్లిలో 1887 మంది, కందుకూరులో 2472మంది మత్స్యకారులకు వేట నిషేధకాల భృతి అందజేస్తున్నట్లు చెప్పారు.

# నగరాభివృద్ధే ధ్యేయం

### మంత్రి నారాయణ



నెల్లూరు నగరంతో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదం, ఆనందం, ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరంలోని 9వ డివిజన్ రాయపాలెంలో అభివృద్ధి చేసిన అంబేద్కర్ పార్క్‌ను పునః ప్రారంభించారు. స్థానిక సంతపేటలోని చేపల మార్కెట్‌ను పరిశీలించి అక్కడి దుకాణాదారులతో వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, నగరాభివృద్ధే ధ్యేయంగా కృషిచేస్తున్నామన్నారు. నగరంలోని 46 పార్కులలో, 54 పాఠశాలల్లో ఆట వస్తువులు, జిమ్ పరికరాలను ఏర్పాటు చేయడమే కాకుండా, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ మైదానాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ కమిషనర్ నందన్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి మారుపేరు.. శ్రీధర్‌రెడ్డి

### ఎంపీ వేమిరెడ్డి ప్రశంస



ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభివృద్ధికి మారుపేరుగా ఉంటూ, రూరల్ నియోజకవర్గంలో ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పనులు చేపడుతున్నారని, అభివృద్ధి ఎలా చేయాలో శ్రీధర్‌రెడ్డి దగ్గర నేర్చుకోవాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల రూరల్ నియోజకవర్గంలోని దేవరపాళెం గ్రామంలో 5 కోట్ల రూపాయల వ్యయంతో దేవరపాళెం నుంచి తాటిపర్తి మెయిన్‌రోడ్డును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, రూరల్‌లో అభివృద్ధి పనుల జాతర జరుగుతోందని, దాదాపు 303 పనులకు శంకుస్థాపన చేయడం గొప్ప విషయమని అన్నారు. ప్రజల బాగు కోసం కష్టపడే ఒక మంచి ఎమ్మెల్యేని ఇక్కడి ప్రజలు గెలిపించుకున్నారంటూ ప్రశంసించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, రూరల్ నియోజకవర్గంలోని పొట్టేపాళెం, ములుముడి కలుజు మీద వంతెనల నిర్మాణాలను కూడా చేయిస్తామని, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఆ పనులను సాధిస్తామని చెప్పారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యోగాలో కావ్యశ్రీ అద్భుత ప్రతిభ



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, యోగాసన భారత్ సంయుక్తంగా ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి యోగా పోటీల్లో నెల్లూరుకు చెందిన గుంజి కావ్యశ్రీ ప్రథమ స్థానంలో నిలిచి, బంగారు పతకం సాధించింది. రెండో ఏషియన్ ఇంటర్నేషనల్ యోగా స్పోర్ట్స్ చాంపియన్ పోటీల్లో మొత్తం 21 దేశాల నుంచి యోగా సాధకులు పాల్గొనగా, కావ్యశ్రీ అగ్రశ్రేణిలో నిలవడం ఎంతైనా విశేషం.

# ఐటిఐ అడ్మిషన్లకు దరఖాస్తులు పంపండి

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో అడ్మిషన్ల కోసం మే 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఐటీఐల కన్వీనర్ కె.శ్రీధర్‌రెడ్డి ఏప్రిల్ 29న ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఐటిఐ.ఏపీ.జిఓవి.ఇన్‌లో దరఖాస్తును పూర్తిచేయాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలలో మే 26వ తేదీలోగా ధ్రువీకరణ చేయించుకోవాలని సూచించారు.




# వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

ఈ వేసవిలో జిల్లావ్యాప్తంగా 50 కేంద్రాల్లో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ఏర్పాటుచేస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్.కె యతిరాజ్ ఏప్రిల్ 29న ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్, ఆర్చరీ, హాకీ, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, సాఫ్ట్‌బాల్, చెస్, తైక్వాండో, యోగా క్రీడాంశాలకు సంబంధించిన శిక్షణ ఉంటుందన్నారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణా శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిక్షణ అనంతరం ధ్రువపత్రంతో6పాటు, ప్రావీణ్యాన్ని బట్టి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, పలు క్రీడాసంఘాలు నిర్వహించే జిల్లాస్థాయి జట్ల ఎంపికల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని వివరించారు.

# సమన్వయంతో పనిచేస్తేనే.. గ్రామ స్వరాజ్యం

## - ఎంపీ వేమిరెడ్డి, మంత్రి గొట్టిపాటి



గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అందుకు అందరూ సమన్వయంతో పనిచేయాల్సి ఉందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం కూనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 500 మంది వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరగా, వారిని పార్టీ కండువాలతో ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో రూ. 50 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ. 18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉలవపాడు మండలంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం ద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. బద్దిపూడి గ్రామంలో ప్రతి ఇంటికి పైప్ లైన్‌తో నీటి సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. గ్రామాల్లో నాయకులు కలిసికట్టుగా ముందుకు సాగి అభివృద్ధి చేసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు అధ్వాన్నంగా ఉండేవని, కూటమి ప్రభుత్వం వచ్చాక, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఇప్పుడు ఎక్కడ చూసినా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, గతంలో గ్రామాల్లో ప్రజలు నీటి వసతులు లేక అవస్తలు పడేవారని, ఇప్పుడు మండలంలోని ప్రతి గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాశ్వత మంచినీటి వసతి కల్పిస్తున్నారన్నారు. అందుకు కూటమి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారని అంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం..

ఉలవపాడు మండలంలోని మన్నేటి కోట పంచాయతీలో సోమవారం 33/11 కె.వి. నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులతో మాట్లాడారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. సాంప్రదాయ విద్యుత్ వినియోగానికి ప్రత్యామ్నాయంగా ప్రతి ఇంట్లో సోలార్ పవర్ వినియోగం పెంచాలన్న ఉద్దేశంతో కేంద్రం పీఎం సూర్యఘర్ పథకాన్ని తీసుకువచ్చిందని, ఇందులో ఎస్సీ ఎస్టీలకు సోలార్ యూనిట్లకు కేంద్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. బీసీలకు కేంద్ర ప్రభుత్వం యిచ్చే 60 వేల సబ్సిడీతో పాటు రాష్ట్రం మరో 20 వేలు ఇస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యిచ్చే సబ్సిడీలు సద్వినియోగం చేసుకొని ప్రజలు సోలార్ విద్యుత్ వినియోగం వైపు మొగ్గు చూపాలన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే సమీపంలో ఉన్న నాలుగు గ్రామాలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. గ్రామాలకు నిరవధిక విద్యుత్ సరఫరా లభిస్తుందని, ఇది రైతులకు ఎంతగానో ఉపయోగమని తెలిపారు.



# ఆనం నివాసం వద్ద.. మెట్టుకూరు సంబరాలు

నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్‌గా రెండోసారి నియమించబడిన మెట్టుకూరు ధనంజయరెడ్డి అనుచరులు ఇటీవల తమ అభిమాన నాయకుడైన నెల్లూరులోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసం వద్ద బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో మెట్టుకూరును ఆ పదవిలో నియమిస్తూ అధికారిక ప్రకటన విడుదలైన అనంతరం సంతోషంతో వారంతా ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు.

### సోమిరెడ్డితో భేటీ...



డీసీసీబీ అధ్యక్షులుగా నియమితులైన మెట్టుకూరి ధనుంజయరెడ్డి ఇటీవల సర్వేపల్లి శాసనసభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# గంగపుత్రుల సంక్షేమం..టీడీపీకే సాధ్యం

## వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు నుంచి నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరకు మత్స్యకారుల అభ్యున్నతికి పాటు పడుతున్నది తెలుగుదేశం పార్టీయేనని, గంగపుత్రుల సంక్షేమం ఒక్క తెలుగుదేశంపార్టీకే సాధ్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి. విడవలూరు మండలం ఊటుకూరు పెద్దపాళెం గ్రామంలో ఆమె ఇటీవల 'మత్స్యకార సేవలో' పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు భారీ గజమాల, వినూత్నంగా చేపల మాలతో ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రశాంతమ్మ మాట్లాడుతూ, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మత్స్యకారులకు 20 వేల రూపాయల వేట నిషేధకాల భృతిని గంగపుత్రుల ఖాతాలలో జమ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక సర్పంచ్ చేసిన వినతిపై స్పందిస్తూ మత్స్య సంపదను సకాలంలో మార్కెట్‌కు తరలించుకునేందుకు వీలుగా సముద్రం వరకు సిమెంట్ రోడ్డు వేయిస్తానని ఆమె హామీ యిచ్చారు. స్థానిక మత్స్యకార నాయకులు, ఫిషరీస్ జెడి నాగేశ్వరరావు, బుచ్చి ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మెన్లు మోర్ల సుప్రజ, నస్రీన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# జపనీస్ పెట్టుబడుల గమ్యస్థానంగా.. శ్రీసిటీ

## - జపాన్ రాయబారి ఒనో కెయిచి




భారత్‌లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి సోమవారం శ్రీసిటీని సందర్శించారు. గత నవంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇది ఆయన మొట్టమొదటి శ్రీసిటీ పర్యటన. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకహాషి మునియో, ఇతర అధికారులతో కలిసి ఆయన శ్రీసిటీ పర్యటనకు వచ్చారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. తొలిసారి శ్రీసిటీ సందర్శనే అజెండాగా జపాన్ రాయబారి ఇక్కడ పర్యటనకు రావడం తమకు సంతోషంగా ఉందని డా. సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీసిటీ ప్రగతిని వివరిస్తూ, 31 దేశాలకు చెందిన 235 కంపెనీలకు నిలయమైన శ్రీసిటీ, దేశంలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటిగా పేరుగాంచిందని తెలిపారు. జపనీస్ సంస్థలకు భారత దేశంలో రెండవ అతిపెద్ద పెట్టుబడి గమ్యస్థానంగా శ్రీసిటీ ఆవిర్భవించిందని, భారీ కంపెనీలతో పాటు పలు అనుబంధ పరిశ్రమలతో శ్రీసిటీలోని బలమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థతో రాణిస్తోందని చెప్పారు. పరిశ్రమ, విద్య, సుస్థిరత మూల స్తంభాలుగా అభివృద్ధి నమూనాను పెంపొందించడంలో శ్రీసిటీ నిబద్ధతను ఆయన రాయబారికి వెల్లడించారు. అనంతరం, శ్రీసిటీ అభివృద్ధి, వ్యాపార అవకాశాలకు సంబంధించిన వివిధ అంశాలపై జపాన్ రాయబారి చర్చలు జరిపారు. జపాన్ పెట్టుబడులను ప్రోత్సహించడంలో కీలక పాత్ర వహించడంతో పాటు ఇండో-జపాన్ ఆర్థిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లడంలో శ్రీసిటీ చేస్తున్న చురుకైన ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. జపాన్‌లోని హిరోషిమా, టొయామా, ఎహైమ్ ప్రాంతాల వ్యాపార ప్రతినిధులు ఇటీవలి శ్రీసిటీ సందర్శనలను ఉటంకిస్తూ, జపనీస్ వ్యాపారవేత్తలకు శ్రీసిటీ అత్యంత అనువైన గమ్యస్థానంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జపాన్ పెట్టుబడిదారులకు శ్రీసిటీ వ్యాపార అనుకూలతలను సిఫారసు చేస్తానని తెలిపారు. శ్రీసిటీలోని జపాన్ కంపెనీల ప్రతినిధులు కూడా శ్రీసిటీ వ్యాపారానుకూల వాతావరణం, యాజమాన్య సహకారం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఆయన స్థానిక డైకిన్, యూనిచార్మ్ పరిశ్రమలను సందర్శించి, అక్కడ ఉత్పత్తులు ఇతర కార్యకలాపాలను పరిశీలించారు. జపాన్ రాయబారి పర్యటన, స్థానిక జపాన్ కంపెనీలు వ్యక్తపరచిన అనుకూల భావన, భారత్-జపాన్ సంబంధాలను మరింత బలోపేతంచేసి, శ్రీసిటీలో పెట్టుబడులకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని శ్రీసిటీ వర్గాలు భావిస్తున్నాయి.



# జానకిరామ.. రామాయణం 63

- ఊటుకూరు జానకి రామారావు



అందుకు త్రిలోక భయంకరుడైన రావణుడు తీవ్రంగా బదులు పలికినాడు.

సీతా! నేను సకలలోక భయంకరుడైన రాక్షసరాజు రావణుడను, నా నగరం లంక. అది సముద్రమధ్యమందున్న ఒక పర్వతాగ్రం మీద నిర్మింపబడిన ఒక సుందర నగరం.

ఓ సీతా! నిన్ను కనిన నా కన్నులకు నా భార్యల సౌందర్యమూ ఒక సౌందర్యమేనా అను భావన కలుగుతుంది. వారివలన ఇక ఎంతమాత్రమూ సుఖం పొందజాలను.

నీ అందం మాకందము!

ఓ తరుణీ ఎన్నో లోకాలనుండి ఎందరో సుందరాంగులను తెచ్చుకొని సుఖించుచున్న నాకు నీవంటి సౌందర్యరాశి ఇప్పటివరకూ అగుపడలేదు.

రా! నాతో సుఖించు!

సర్వాలంకార భూషితలైన అయిదు వందల మంది దాసీ జనం నీకు ఊడిగంసేయ సిద్ధంగా ఉన్నారు....

రావణుడి ఉన్మత్త ప్రేలాపనలు విన్న సీతాదేవి ఆగ్రహోదగ్ర అయింది! వానిని నిందిస్తూ పరుషంగా బదులు పలికింది.

నా భర్త రాముడు ఎలాంటి వాడనుకొన్నావు?

మహేంద్రుడి వంటివాడు, మహాసముద్రం వలే క్షోభింప శక్యం కాని వాడు... నేను అట్టి రాముని విషయమందే వ్రతం కలదానను.

రాముడు సర్వలక్షణ సంపన్నుడు. వటవృక్షం వలే ఆశ్రితులకు సుఖం కలిగించువాడు. సత్యసంధుడు, మహాభాగ్యవంతుడు.

నేను అట్టి రాముని అనుసరించుట అనువ్రతం కలదానను.

రాముడు మహాబాహువు! విశాల వక్షస్థలం కలవాడు. నరులలో శ్రేష్ఠుడు! సింహం వంటివాడు! సింహపునడక కలవాడు.

నేను అట్టి రాముని విషయమునందే వ్రతం కలదానను.

నక్కలాంటి నీవు ఏ మాత్రం లభ్యం కాని ఆడుసింహమైన నన్ను కోరుతున్నావు అని అంటూ ఇంకా రావణుని తీవ్రంగా హెచ్చరించసాగింది సీతమ్మ.

ఆమె నేత్రాలు క్రోధారుణిమ దాల్చాయి.

రావణునుద్దేశించి,

నీవు రాముని భార్యను కోరుకుంటున్నావు. నీకు బంగారు వృక్షాలు కనపడుతున్నట్లుగా ఉంది. (మరణమాసన్నమైన వానికి బంగారు వృక్షాలు కనపడతాయట).

రాముని ప్రియసతిని కోరుతున్న నీవు,

ఆకలిగొన్న సింహం నోటిలో చేయి దూరుస్తున్న వానిలాగా,

మహాసర్పం కోర లాగాలనుకున్న వానిలాగా,

మందరపర్వతాన్ని ఒంటి చేయితో లేపాలని చూసే వానిలాగా,

కాలకూట విషం త్రాగి బ్రతకాలి అని అనుకునే వానిలాగా,

సూదితో కళ్ళు పొడుచుకొనే వాని లాగా,

మంగలికత్తిని నాలుకతో నాకే వాని లాగా,

గుదిబండను మెడకు కట్టుకొని సముద్రంలో ఈద పయత్నించు వానిగా,

భగభగ మండే నిప్పుకణాన్ని వస్త్రంలో మూట కట్టుకొను వానిగా కనపడుతున్నావు!

నీకూ రామునికి... నక్కకూ సింహానికి ఎంత భేదమో అంత!

రాముడు సముద్రం, నీవు బోడి కాలువ

రాముడు బంగారం, నీవు సీసం

రాముడు క్షీరం, నీవు కడుగునీరు

రాముడు మంచి గంధం, నీవు వట్టి బురదవు

రాముడు ఏనుగు, నీవు పిల్లివి

రాముడు గరుడుడు, నీవు ఒక కాకివి

నన్ను అపహరించటం ఈగ వజ్రాన్ని మింగటం లాంటిది.

అది వజ్రాన్ని ఇముడ్చుకోగలదా?

ఇలా ఆ దుష్ట రావణునితో మాట్లాడుతూ గాలికి ఊగే అరటిచెట్టు లాగా శరీరం వణికిపోతూ తీవ్రమైన వ్యధ చెందింది సీతమ్మతల్లి.

సీతాదేవి హెచ్చరికలను ఏ మాత్రం లక్ష్యపెట్టలేదు రావణుడు. కుపితుడైనాడు! కనుబొమలు విరిచి,

ఓ సీతా! నీకు మంగళమగుగాక!

నేనెవరనుకున్నావు?

కుబేరుడి సవతి తమ్ముడను!

"రావణుడు" అని లోకంలో ప్రసిద్ధికెక్కినవాడను!

మృత్యువుకు భయపడి పారిపోవునట్లు జనులందరూ నన్ను చూసి పారిపోవుదురు! దేవ, గంధర్వ, పతగ, పన్నగ, పిశాచులలో ఎవడునూ నా సమీపంలోకి రావటానికి సాహసించడు!

కుబేరుడిని ఓడించి అతని నగరాన్ని స్వాధీనం చేసుకున్న వాడను "నేను".

"నేను" ఉన్నచోట వాయువు భయపడుతూ వీస్తాడు.

"నేను" ఉన్నచోట సూర్యుడు తన కిరణతీవ్రత తగ్గించుకుంటాడు.

"నేను" ఉన్నచోట నదులు మందంగా ప్రవహిస్తాయి.

"నేను" ఉన్నచోట చెట్లు ఆకులు కదల్చటానికి కూడా భయపడతాయి.

"నేను" నేనే!

లేడు నాకెవ్వడునూ సరిసాటి!

నా లంక అందాల నెలవంక

అది ఇంద్రుడి అమరావతి!

సముద్రానికి ఆవలి ఒడ్డున ఒక పర్వతాగ్రం మీద ఉన్న సుందరమైన పట్టణమది.

అష్టైశ్వర్యాలతో సకల భోగభాగ్యాలతో తులతూగుతూ వున్న పట్టణమది.

అది భయంకరమైన రాక్షసుల నివాస స్థానం!

నీవు నాతో కలిసి అక్కడ నివసిస్తే అప్పుడు ఈ మానవుల నెవరినీ నీవు ఇక స్మరించలేవు!

రాముడసలే నీకు గుర్తురాడు!

రాముడు! అతని పరాక్రమం!

అల్పపరాక్రమవంతుడు కాబట్టే తండ్రి వెళ్ళగొట్టాడు!

దరిద్రుడై, రాజ్యభ్రష్టుడై కొండలు, కోనలు, అరణ్యాలు పట్టుకొని తిరుగుతున్నాడు.

వాడు దీనుడు!

బుద్ధిహీనుడు

వాడితో నీవేమి సుఖపడతావు!

సకలరాక్షసలోకానికి ప్రభువును నేను

మహదైశ్వర్యవంతుడిని నేను

అమిత పరాక్రమశాలిని నేను.

ఆ మన్మథ సాయకాలు నా మనస్సును కాల్చివేస్తున్నాయి నీవు నన్ను అనుగ్రహించు!.

రాముడు నా వ్రేలికి కూడా యుద్ధంలో సరిపోడు అంటూ.. రామ నింద చేస్తూ, కామాతురుడై వదరుతున్న రావణుని చూసి సీతాదేవి కన్నులు కోపంతో మరింత ఎర్రబారాయి!

రావణుని ఉద్దేశించి "కుబేరుడి తమ్ముడను అని చెప్పుకునే నీకు ఈ పాడు బుద్ధి ఎందుకు వచ్చింది? నీవు చేసే ఈ పని వల్ల సమస్త రాక్షసలోకానికే పోగాలం దాపురించినట్లే, ఇంద్రుడి భార్యను అపహరించి జీవించగలవేమో కానీ రామపత్నిని అపహరించినచో ఇక నీ ప్రాణములపై ఆశ వదులుకోవలసిందే" అని హెచ్చరించింది సీతాదేవి!

సీతాదేవి మాటలు విన్న రావణుడు ఒక్కసారిగా వికటాట్టహాసం చేశాడు, ఒక చేతిలో మరొక చేయివేసి చరిచి శరీరాన్ని పెద్దగా చేశాడు.

సీతాదేవినుద్దేశించి పలుకుతూ "నీవొక పిచ్చిదానివి, నా వీర్యం, బలపరాక్రమాలు ఎంత చెప్పినా నీ తలకు ఎక్కడం లేదు!

ఆకాశంలో నిలుచుని భూమిని ఎత్తివేయగలను, సముద్రం మొత్తాన్ని త్రాగివేయగలను, సాక్షాత్తూ మృత్యువే యుద్ధంలో నాకు ఎదురుగా నిలబడిపోరాడితే మృత్యువునే చంపివేయగల సమర్థుడను! ఇచ్ఛానుసారం రూపం ధరించగలను, ఓ ఉన్మత్తురాలా చూడు నీ కోరికలు తీర్చగల నీ భర్తనైన నా రూపం చూడు. కోపంతో మాట్లాడుతున్న రావణుని కన్నుల ఎరుపుజీరలు ప్రస్ఫుటంగా కనపడుతున్నాయి, సన్యాసిరూపాన్ని విడిచి యముడి లాంటి తన రూపానికి మారిపోయాడు.

నల్లటిమేఘంలాగా ఉన్నాడు, పదితలల ఉగ్రరూపం ధరించాడు. ఇరువది నేత్రాలు ఎర్రగా ఉన్నాయి. ఎర్రటి వస్త్రాలు ధరించి ధగధగమెరిసిపోయే స్వర్ణాభరణాలు అలంకరించుకొని ధనుర్బాణాలతో నిలిచి ఉన్నాడు.

సీతాదేవితో ఇలా అన్నాడు రావణుడు "నీకు భర్తగా తగినవాడను నేనే, ఆ రాముడినిక మరచిపో, నీకు ఇష్టం కాని పని నేను చేయను, నీ మనస్సు నాపై మరల్చు.

..(సశేషం)

# శాశ్వత పరిష్కారానికి ఇదే సమయం

మనసులో మాట 43

కశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను మతం తెలుసుకుని మరీ కాల్చి చంపడం దేశ వ్యాప్తంగా కోట్ల మంది ప్రజలను కలచివేసింది. ఉగ్రవాదులపై, ఉగ్రవాదాన్ని భారత్‌పైకి ఎగదోస్తున్న పాకిస్థాన్‌పై యావద్దేశం భగ్గుమంటోంది. ఎన్నాళ్లిలా ఉగ్రవాదుల అరాచకాన్ని చూస్తూ కూర్చోవాలని, తాడోపేడో తేల్చేయాలని కోట్లమంది భారతీయులు కోరుకుంటున్నారు. ఈ చర్యపై భారత్‌లోనే కాదు.. పాకిస్థాన్‌లోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అసలే ఓ పక్క ఆకాశాన్నంటుతున్న ధరలతో జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోయిన పరిస్థితుల్లో అన్నివిధాలా బలంగా ఉన్న భారత్‌ను ఈ విధంగా రెచ్చగొట్టడం వల్ల తమ జీవితాలు మరింత దారుణంగా తయారవుతాయన్న భయం పాక్ ప్రజల్లో ఉంది. మునుపటి లాగా అక్కడి ప్రజల్లో పాక్ సైనిక, పాలకపక్షాల చర్యలపట్ల అనుకూలత లేదు. భారత్ వ్యతిరేక భావోద్వేగాలు లేవు. పాకిస్థాన్ ప్రజలు చాలా విషయాల్లో వ్యక్తిగతంగా భారత్‌పై ఆధారపడుతున్నారు. ఉదాహరణకు మెరుగైన వైద్య సేవలకు భారత్‌కు వచ్చి వెళ్తున్నారు. పహల్గాం సంఘటన తర్వాత పాకిస్థాన్ పౌరులకు అన్ని రకాల వీసాలను భారత్ రద్దుచేసి వారిని తక్షణం సరిహద్దులు దాటించి పంపిచేస్తోంది. కొత్తగా ఎవరినీ ఇటువైపు అనుమతించదు. మరోవైపు సింధూ జలాల ఒప్పందాన్ని రద్దుచేసింది. ఇది పాక్‌కు పెద్ద శరాఘాతమే.

పాకిస్థాన్‌పై, స్వతంత్ర కశ్మీర్ పేరుతో ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్న వివిధ ముఠాలపై భారత ప్రజల్లో మునుపెన్నడూ లేనంత వ్యతిరేకత కనబడుతోంది. ఇంతటి సంఘటిత గళం గతంలో ఎప్పుడూ లేదు. ప్రధాని మోదీ మాటలు కూడా దీన్ని ప్రతిఫలించాయి. ఉగ్రవాదాన్ని మట్టికరిపించాలన్నది జాతీయ సంకల్పమని, దీన్ని నెరవేర్చేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నామని మంగళవారం జరిగిన అత్యున్నత స్థాయి సమావేశంలో ప్రకటించారు. ఉగ్రవాదులపై చర్యల విషయంలో ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూడాల్సిన అవసరం కూడా లేదని, సైన్యం సహా భద్రతా బలగాలు స్వేచ్ఛగా నిర్ణయం తీసుకోవచ్చని కూడా చెప్పారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌కు గట్టి బుద్ధిచెప్పే చర్య ఏదో ఒకటి త్వరలో ఉంటుందన్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. సైన్యానికి స్వేచ్ఛ ఇవ్వడం అనే పరిణామాన్ని.. సరిహద్దుల్లో భౌగోళిక-రాజకీయ(జియో పాలిటిక్స్) విషయంలో అంతర్జాతీయంగా విమర్శల దాడి నుంచి ప్రభుత్వం దూరం జరిగే వ్యూహంగా భావించవచ్చు. చాలా తెలివైన నిర్ణయమది.

అయితే భారత్ గట్టి చర్య తీసుకోవడానికి ముందుగానే అంతర్జాతీయ సమాజాన్ని తటస్థంగా ఉంచే ప్రయత్నం కూడా చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా అమెరికా, రష్యా, చైనాలను తటస్థంగా ఉండేలా చేయడం చాలా ముఖ్యం. ఈ విషయంలో ఆ దేశాల అవగాహన ఎలా ఉందో మనం గమనించాలి. కశ్మీర్‌కు సంబంధించి ట్రంప్ అవగాహన హాస్యాస్పదంగా ఉంది. భారత్, పాకిస్థాన్ మధ్య 1500ఏళ్లకు పైగా అభిప్రాయభేదాలున్నట్లుగా ఇటీవల ఆయన మాట్లాడారు. అంతేకాదు.. రెండు దేశాలూ తనకు ముఖ్యమే అన్నట్లు మాట్లాడారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో, ముఖ్యంగా భారత్ విషయంలో ఆయన నిర్లక్ష్యాన్ని ఈ వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. మరోవైపు భారత్- పాక్‌లు సంయమనం పాటించాలని చైనా సుద్దులు చెప్పింది. అమెరికా-చైనా మధ్య తీవ్ర వాణిజ్య యుద్ధం నడుస్తున్న నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ తీసుకునే చర్యలను అమెరికా వ్యతిరేకించకపోవచ్చు. అమెరికా విధించిన సుంకాలతో చైనా ఎగుమతులు స్తంభించి ఉక్కిరిబిక్కిరవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ వాణిజ్యగమ్యాలను వెదుక్కొంటున్న చైనా.. పాక్‌పై భారత్ తీసుకోబోయే చర్యలు నచ్చకున్నా ప్రస్తుతానికి మాటలతో వ్యతిరేకించి సరిపెట్టవచ్చు. పాకిస్థాన్‌కు నేరుగా మద్దతు ప్రకటించే అవకాశాలు తక్కువే. రష్యా విషయానికి వస్తే భారత్‌కు అనుకూలంగా వ్యవహరించే అవకాశాలు ఎక్కువ. ఎందుకంటే ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై అమెరికా ఆంక్షలు విధించినా, అమెరికా వద్దని గట్టిగా వారించినా భారత్.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసింది. ఆంక్షల సమయంలో రష్యాకు భారత్ వాణిజ్య భాగస్వామ్యం బాగా ఉపకరించింది. భారత్‌ను నమ్మకమైన భాగస్వామిగా చూస్తోంది. ఈ పరిస్థితుల్లో పాక్‌పై భారత్ చర్యలకు ఉపక్రమిస్తే నేరుగా మద్దతు తెలపకున్నా వ్యతిరేకత కనబర్చకపోవచ్చు. భారత్‌కు సరిహద్దుల పరంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ ముఖ్యమైన ప్రాంతం. దీన్ని భారత్ నియంత్రణలోకి తెచ్చుకోవాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ఆ ప్రాంత ప్రజలు కూడా భారత్ నియంత్రణ కోరుకుంటున్నారు.

ఇటీవల కాలంలో బంగ్లాదేశ్ నుంచి కూడా భారత్ వ్యతిరేక వైఖరి వినిపిస్తున్న నేపథ్యంలో ఆ దేశంలో ఉన్న చిట్టగాంగ్‌పై నియంత్రణ సాధించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. చైనాతో కలిసి బంగ్లాదేశ్ కుట్రపన్నుతూ ఈశాన్యరాష్ట్రాలపై కన్ను వేస్తున్నట్లు ఇటీవలి పరిణామాలు తెలియజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన సిలిగుడి నడవాను వెడల్పు చేయాలని, 22కి.మీ. మాత్రమే వెడల్పు ఉన్న ఈ నడవాను 100 కి.మీ. మేర వెడల్పు చేయాలంటే బంగ్లాదేశ్‌లోని రంగపూర్ ప్రాంతాన్ని నియంత్రణలోకి తెచ్చుకోవాలని కూడా డిమాండ్లు వినిపిస్తున్నాయి. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన నేపథ్యంలో ఈ డిమాండ్లకు ప్రాధాన్యం ఏర్పడింది. దీర్ఘకాలంగా వేధిస్తున్న పొరుగు సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించడానికి మాత్రం ఇదే అనుకూలమైన సమయం అని చెప్పవచ్చు.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి

● హాస్టళ్ళ విద్యార్థులను అభినందించిన కలెక్టర్



జిల్లాలో ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన సాంఘిక సంక్షేమ హాస్టళ్ళ విద్యార్థినీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఆనంద్ అభినందనలు తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ పరీక్షల్లో 961 మార్కులు సాధించిన నెల్లూరు సాంఘిక సంక్షేమ ప్రభుత్వ హాస్టల్ విద్యార్థిని యాదల సంగీత, సిఇసిలో 927 మార్కులు సాధించిన బద్దిపూడి మేఘనలకు కలెక్టర్ శుభాశీస్సులు తెలిపి, వారికి జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. అదేవిధంగా, పదవ తరగతిలో 574 మార్కులు సాధించిన వింజమూరు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఏ.నందిని, 568 మార్కులు సాధించిన ఉలవపాడు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఎన్. కాజోల్ లక్ష్మి అగర్వాల్, 565 మార్కులు సాధించిన ఆత్మకూరు సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ విద్యార్థి ఒంటేరు సాయి ధనుష్ తదితరులకు ఇటీవల జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్‌లో ప్రత్యేకంగా శుభాభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మంచి చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

# అన్యాయాలను ఎదిరించి పోరాడాలి!

○ ప్రజాసంఘాలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి పిలుపు



పేదల ప్రయోజనాల విషయంలో రాజీ పడవద్దని, ఎక్కడ అన్యాయం జరిగినా పోరాడాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రజాసంఘాలకి పిలుపునిచ్చారు. ఇటీవల మనుబోలు మండలం చెర్లోపల్లిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణను పురస్కరించుకుని ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెర్లోపల్లి యువత, విద్యావంతులందరూ కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. గతంలో మర్రిపాడులో ఇద్దరు దివ్యాంగులు పోలీసుల వేధింపులతో ప్రాణాలు విడిచారని, అలాంటి ఘటనలు జరిగినప్పుడు దళిత సంఘాల నాయకులు ముందుకు రాకపోవడం బాధాకరమని అన్నారు. ఉదయగిరి నారాయణ, దుగ్గిరాల కరుణాకర్ ప్రాణాలు కోల్పోయిన సమయంలో తాను ఢిల్లీ వెళ్లి జాతీయ ఎస్సీ కమిషన్‌ను కలిశానని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేవరకు ఊరుకోలేదని చెప్పారు. మర్రిపాడులో దివ్యాంగుల మృతికి కారణమైన ఎస్ఐపై డీజీపీకి ఫిర్యాదు చేశానని, దాంతో ఆ ఎస్ఐ సస్పెండ య్యాడని తెలిపారు. సర్వేపల్లిలో గిరిజనులకు చెందిన 6.21 ఎకరాలను పెద్ద రెడ్లు కబ్జాచేస్తే సంఘాలు ఏం చేస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. వావిలేటిపాడులో ఏడుగురు దళితులకు చెందిన రూ.30 కోట్లు విలువచేసే ఐదు ఎకరాల భూమిని ఓ పెద్దమనిషి కబ్జాచేస్తే, తాను పోరాటం చేసి బాధితులకు ఇప్పించానని గుర్తుచేశారు. పేదల హక్కుల కోసం ప్రజా సంఘాలు పోరాడాలి... వారికి అండగా తానుంటానని, ఈ విషయంలో రాజీ ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఎన్‌బికెఆర్‌లో వార్షిక క్రీడాదినోత్సవం



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి కళాశాలలో ఇటీవల వార్షిక క్రీడాదినోత్సవం ఉత్సాహంగా జరిగింది. కళాశాల క్రీడా సముదాయంలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అథ్లెటిక్స్‌లో పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్‌లతో పాటు క్రీడా విభాగాల్లో వాలీబాల్, బాస్కెట్ బాల్, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, హ్యాండ్‌బాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులందజేశారు. అథ్లెటిక్స్ మహిళా విభాగంలో ఎఐ అండ్ డిఎస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని గాయత్రి వ్యక్తిగత చాంపియన్ సాధించింది. అదేవిధంగా, పురుషుల విభాగంలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో తృతీయ సంవత్సరం విద్యార్థి శ్రీనివాసులురెడ్డి వ్యక్తిగత చాంపియన్‌గా నిలిచాడు. కళాశాల ఉద్యోగులకు కూడా క్రికెట్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులిచ్చారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి, వ్యాయామ అధ్యాపకులు డా.వి.మల్లికార్జునరెడ్డి, ఐటి మరియు ఏఐడిఎస్ విభాగాధిపతి డా.ఏ.నారాయణరావు చేతుల మీదుగా విజేతలు బహుమతులందుకున్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# చీరాల నాయకులతో గూడూరు ఎమ్మెల్యే



చీరాల పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో ఇటీవల చీరాల నియోజకవర్గ నాయకుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ హాజరై ఈ నెల 2వ తేదీ అమరావతి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు.

# నెల్‌క్యాస్ట్ - కిమ్స్ మెగా వైద్య శిబిరం





నెల్‌క్యాస్ట్ లిమిటెడ్, రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, నెల్లూరు వారి సహకారంతో గూడూరులోని నెల్‌క్యాస్ట్ లిమిటెడ్ ఆవరణలో మెగా వైద్య శిబిరం జరిగింది. నెల్‌క్యాస్ట్ ఉద్యోగులకు కిమ్స్ వారి సహకారంతో ఇసిజి, షుగర్, బి.పి, డెంటల్ పరీక్షలు చేయగా, అగర్వాల్ సహకారంతో కంటి పరీక్షలు, గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి సహకారంతో బ్లడ్‌క్యాంప్ నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు ఎ.సనీష్‌రెడ్డి, ఉదయకిరణ్, శ్రీనివాసులునాయుడు, రవికిరణ్ పాల్గొని వైద్యసేవలు అందించారు. కిమ్స్ ఆసుపత్రి పిఆర్‌ఓ నవీన్ జయకుమార్, నెల్‌క్యాస్ట్ లిమిటెడ్ పిఆర్‌ఓ ఆనిమెళ్ళ శివకుమార్ నిర్వహణలో జరిగిన ఈ వైద్య శిబిరంలో రోటరీ వెస్ట్ గౌరవాధ్యక్షులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, అధ్యక్షులు నాశిన నాగులు, కార్యదర్శి గిరిబాబు, వాసుగౌడ్, శ్రీకంటి రామ్మోహన్‌రావు, దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, సనత్ కుమార్‌రెడ్డి, నెల్‌క్యాస్ట్ ప్లాంట్ ఇన్‌ఛార్జి వెంకటేశన్, పి.ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో కార్డన్‌సెర్చ్



గూడూరు రెండో పట్టణంలోని తిలక్‌నగర్ ప్రాంతంలో డీఎస్పీ డాక్టర్ గీతాకుమారి ఆధ్వర్యంలో ఇటీవల కార్డన్‌సెర్చ్‌ను నిర్వహించారు. సరైన పత్రాలు లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేసి, అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించామని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని చెప్పారు. అనుమానితులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెండో పట్టణ సి.ఐ శ్రీనివాస్, ఎస్సైలు మనోజ్‌కుమార్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉగ్రదాడి అమానుషం



కాశ్మీర్ ఉగ్రదాడి అమానుషమని, ఆ దాడిలో మృతి చెందిన పర్యాటకుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని సునీతా సేవాసంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగం శ్రీనివాసులు, సులక్ష్మి తెలిపారు. గూడూరులోని సంస్థ కార్యాలయంలో ఇటీవల నల్ల రిబ్బన్లు ధరించి మృతులకు నివాళులర్పించారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఘనంగా వీడ్కోలు సభ


అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి పి లోకనాథం బదిలీపై వెళ్తుండడంతో ఏప్రిల్ 28వ తేదీ గూడూరు బార్ అసోసియేషన్ సభ్యులు వీడ్కోలు సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా 7వ అదనపు జిల్లా జడ్జి కే.వేంకట నాగపవన్, సీనియర్ సివిల్ జడ్జి బీ.రాజేష్‌లు పాల్గొనగా, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శంకరయ్య, గూడూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాశంకర్, హరిప్రసాద్, వెంకటకృష్ణయ్య, ఎం.శ్రీనివాసులు, కమిటీ సభ్యులు, న్యాయ వాదులు పాల్గొన్నారు.

# ఉచిత క్రికెట్ శిక్షణా శిబిరం



గూడూరు పట్టణం, అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఏసీఏ సబ్ సెంటర్‌లో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో ఉచిత క్రికెట్ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సబ్‌సెంటర్ ఇన్‌ఛార్జి కె.మునిగిరీష్ తెలిపారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 2వ తేదీ నుంచి నెలరోజుల పాటు వేసవిలో ఉచిత క్రికెట్ శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. 7 నుంచి 16ఏళ్ళ చిన్నారులు శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు.

# కల్యాణ వైభవం...!




తిరుపతి జిల్లా, గూడూరు వాస్తవ్యులు ఓజిలి గురవయ్య - భవానిల కుమార్తె
**లక్ష్మీ శరణ్య - రమేష్** (గుత్తికొండ రామకృష్ణయ్య - చంద్రకళల కుమారుడు)ల వివాహం
ఏప్రిల్ 30వ తేదీ గూడూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# కంచికామకోటి పీఠం ఉత్తరాధికారిగా గణేషశర్మ



కంచి కామకోటి పీఠం 71వ పీఠాధిపతిగా శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి నియమితులయ్యారు. పీఠాధిపతి అయిన శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామి వారి సమక్షంలో కంచి పుణ్యక్షేత్రంలో ఏప్రిల్ 30వ తేదీ బుధవారం ఎంతో వైభవంగా శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి నియామకం జరిగింది. అన్నవరానికి చెందిన దుడ్డు సుబ్రహ్మణ్య గణేషశర్మకు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు సన్యాస దీక్షను అనుగ్రహించి శిష్య స్వీకారం చేశారు. అనంతరం, ఉత్తరాధికారిగా నియమితులైన వేదపండితోత్తములు శ్రీ గణేష్ శర్మకు 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి'గా నామకరణం చేశారు. ఈ వేడుకకు తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు హాజరై పీఠాధిపతికి, ఉత్తరాధికారులకు నూతన వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు టీటీడీ ఛైర్మన్‌తో మాట్లాడుతూ తిరుమలతో కంచి పీఠానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ధార్మిక కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయని స్వామీజీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పేష్కార్ శ్రీ రామకృష్ణ, గురురాజ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు శ్రీ శిరిడీ సాయి, శ్రీ యోగాంజనేయస్వామి దేవస్థానాల్లో..

# వైభవంగా ఆధ్యాత్మిక ఉత్సవాలు





ఇందుకూరుపేట మండలం కొత్తూరులో కొలువైవున్న శ్రీ శిరిడి సాయిబాబావారి దేవాలయం, శ్రీ యోగాంజనేయస్వామి వారి దేవాలయాల్లో ఇటీవల పెద్దఎత్తున పూజలు, సేవలు జరిగాయి. ఆలయాల ధర్మకర్తలు కలికి కోదండ రామిరెడ్డి, కలికి శ్రీలత దంపతులు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ శిరిడి సాయిబాబా 17వ వార్షికోత్సవం సందర్భంగా ఏప్రిల్ 20-21 తేదీల్లో విశేష అలంకారాలతో స్వామిని పూజించారు. అదేవిధంగా, ఆ సమీపంలోనే వెలసివున్న శ్రీ యోగాంజనేయస్వామివారి 12వ వార్షిక మహాకుంభాభిషేకాలు కన్నులపండువగా జరిగాయి. ఏప్రిల్ 23న శిఖర మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమత్ ఉపాసకులు కీ.శే ఎంఎస్ రామారావు మనుమడు డా.పి.శ్రీనివాసస్వామివారిచే 11 పర్యాయాలు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. కొత్తూరు నుంచేకాక, చుట్టుపక్కల అనేక ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు హనుమాన్ చాలీసాను భక్తిశ్రద్ధలతో విన్నారు. ఆలయాలను దర్శించుకుని స్వామివార్ల సేవలను తిలకించి తరించారు.

# దేశానికి ఉత్తమ నమూనాగా..శ్రీసిటీ

## - సెజ్‌ల మార్గదర్శకుల బృందం కితాబు -



అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అనేక పరిశ్రమలతో కళకళలాడుతున్న శ్రీసిటీ దేశానికే ఒక ఉత్తమ నమూనాగా ఉందంటూ సెజ్‌ల మార్గదర్శకుల బృందం కితాబునిచ్చింది. సెజ్ పాలసీ లక్ష్యాలకు దీటుగా అభివృద్ధి చెందిన పారిశ్రామికవాడగా శ్రీసిటీ విరాజిల్లుతోందంటూ సాక్షాత్తూ కేంద్ర వాణిజ్య శాఖ మాజీ కార్యదర్శి జి.కె.పిళ్లై అభివర్ణించారు. దేశంలో సెజ్‌ల రూపకల్పనలో కీలక భూమిక పోషించిన పలువురు మాజీ కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. దేశంలో సెజ్‌లు స్థాపించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సందర్శన చోటుచేసుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. జి.కె.పిళ్లై ఆధ్వర్యంలో విచ్చేసిన ఆ బృందానికి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు. శ్రీసిటీ స్థాపన నుంచి ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి, విజయాలు, ఇతర ప్రత్యేకతలను వారికి వివరించారు.

**రవీంద్ర సన్నారెడ్డి దార్శనికత అద్భుతం..**

ఈ సందర్భంగా పిళ్లై మాట్లాడుతూ, శ్రీసిటీ సందర్శన తనకెంతో ఆనందం కలిగించిందని, బంజరు భూమి నుంచి అద్భుత పారిశ్రామిక నగరంగా శ్రీసిటీ రూపాంతరం చెందడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు. డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దార్శనికతతో మారుమూల గ్రామీణ ప్రాంతం ప్రపంచ స్థాయి వ్యాపార నగరంగా మారిందని ప్రశంసించారు. ఆదర్శనీయమైన భూసేకరణ విధానంతో పరిశ్రమ, ఉపాధి, సుస్థిరత సమ్మేళనంతో శ్రీసిటీ సాధించిన ప్రగతి సెజ్ లక్ష్యాలను నెరవేర్చిందని ఆయన కొనియాడారు. శ్రీసిటీ పెట్టుబడి-స్నేహపూర్వక పర్యావరణ వ్యవస్థను సిబిఐసి సభ్యులు యోగేంద్ర గార్గ్ కూడా ప్రశంసించారు. పర్యటన బృందంలోని గోవా మాజీ చీఫ్ సెక్రటరీ అండ్ ఎంఇపి జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ బి.విజయన్, మాజీ ఐఆర్ఎస్ అధికారి బిజోయ్ బిహారీ మోహపాత్రా, మాజీ ఐటిఎస్ అధికారి ఎల్.బి.సింఘాల్, సెజ్‌ల అసోచామ్ కౌన్సిల్, ఇండస్ట్రియల్ పార్కులు మరియు వేర్‌హౌసింగ్ మండలి మాజీ కోఛైర్మన్ హితేంద్ర మెహతా శ్రీసిటీ పరిసరాల సందర్శన అనంతరం పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# పార్టీని బలోపేతం చేయండి

## - కార్యకర్తలకు వైకాపా నేత రామ్‌కుమార్ దిశానిర్దేశం



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన మాజీ రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతులు అభివృద్ధి సంస్థ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్‌తో కలసి పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జగన్ మళ్ళీ అధికారంలోకి వచ్చాక కార్యకర్తల కోసం ఎలా పనిచేస్తామో చూపిస్తామని భరోసా ఇస్తుండడాన్ని ఆయన గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితో ఉత్సాహంగా అందరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. జగన్ ఏర్పాటు చేసిన సచివాలయ, వాలంటీర్ వ్యవస్థల కారణంగా ప్రజలు స్థానిక నేతలు, కార్యకర్తల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయిందని, ఇది పార్టీకి కొంత నష్టం చేసిందన్న విశ్లేషణ కూడా పలు వర్గాల నుండి వచ్చిందన్నారు. పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ క్యాడర్, వాలంటీర్ల వ్యవస్థలను ఎలా వ్యవస్థీకృతం చేయాలో అధ్యయనం చేసేందుకు వెంకటగిరి నియోజకవర్గాన్ని వైఎస్ఆర్సిపి అధిష్ఠానం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని నాగార్జునయాదవ్ తెలిపారు. ఇటీవల మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం వీగిపోయి వైకాపా జయకేతనం ఎగురవేయడం వెంకటగిరికి గుర్తింపు తెచ్చిందని, ఆ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిం చిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి కార్యసాధకుడుగా మాజీ సీఎం వైఎస్ జగన్ వద్ద మరింతపేరు వచ్చిందని ఆయన చెప్పారు. తొలుత, కశ్మీర్‌లోని పెహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మ శాంతి కోసం స్థానిక వైఎస్సార్సీపీ శ్రేణులతో కలిసి నాయకులు కొద్దిసేపు మౌనం పాటించి నివాళులర్పించారు.

# గ్రంథాలయాల పునర్వైభవానికి కృషి

## విజయవాడలో సభలు.. చర్చలు



నేడు ఆదరణ కోల్పోతున్న గ్రంథాలయ వ్యవస్థను పునరుజ్జీవింపజేయడం ప్రభుత్వ విధి. దానిని సంరక్షించుకోవడం ప్రజల బాధ్యత. అయితే, ఆస్తిపన్నులో 8 శాతం వసూలు చేస్తున్న గ్రంథాలయాల సెస్సును దారిమళ్ళించడం జరుగుతోందని ఏపీ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 27న విజయవాడలో మండలి బుద్ధప్రసాద్ తదితర ప్రముఖులతో అన్ని జిల్లాల ప్రతినిధులతో సభలు నిర్వహించి, దశలవారీ ప్రణాళికలతో మళ్ళీ గ్రంథాలయాలకు వైభవం తెచ్చేందుకు కృషిచేస్తున్నామని వివరించారు. గ్రంథాలయాల పట్ల మళ్ళీ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు మండల, గ్రామ స్థాయిలో కమిటీలు కూడా ఏర్పాటుచేయనున్నట్లు ఆ ఉద్యమ వేదిక నెల్లూరు జిల్లా కన్వీనర్ డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య ఈ సందర్భంగా తెలియజేశారు.

# తొలి సోలార్ నగరంగా..అమరావతి

## ముఖ్యమంత్రి సారధ్యంలో...పరుగులు పెడుతున్న రాజధాని పనులు



రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మెన్ అబ్దుల్ అజీజ్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయని, అమరావతి రాజధాని ప్రపంచంలోని తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుందని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ షేక్ అబ్దుల్ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిందన్నారు. 65వేల కోట్లతో, 217 చదరపు కిలోమీటర్లతో, 8352 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రాజధాని అమరావతి రూపుదిద్దుకోబోతోందన్నారు. రాజధాని పునర్నిర్మాణ పనులకు 48 వేల కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని, ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు ఉపాధి దొరుకుతాయని తెలియజేశారు. వైకాపా హయాంలో జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల ప్రతిపాదన కారణంగా పెట్టుబడులు గణనీయంగా తగ్గిపోయి రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువలు పడిపోయాయని, జగన్‌రెడ్డి నిర్వాకం వల్ల రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యాసంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. అందువల్ల లక్షలాదిమంది ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి మద్దతు తెలిపి, అధికారం వచ్చాక మూడు రాజధానుల పేరుతో కులచిచ్చు, ప్రాంతీయ చిచ్చుపెట్టి కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్ళించారని ఆయన మండిపడ్డారు. రాజధాని నిర్మాణం కోసం కాంట్రాక్టర్లకు ఇచ్చిన మెటీరియల్ కూడా వైసిపి ఎంపీ ఎమ్మెల్యేలు తమ అనుచరులతో కలిసి దోపిడీ చేశారని అన్నారు. 1631 రోజులపాటు నిర్విరామంగా రాజధాని రైతులు పోరాటాలు చేశారని, ఆ సుదీర్ఘ పోరాటంలో 200 మందికి పైగా రైతులు వేధింపులు తట్టుకోలేక ప్రాణాలు వదిలారని, రైతుల ప్రాణత్యాగాలు ఓవైపు, పోరాటాలు మరోవైపు, న్యాయస్థానాల జోక్యంతో ఇంకోవైపు.. మొత్తమ్మీద రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా నిలబడిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనా దక్షతతో ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకులను ఒప్పించి తెచ్చిన నిధులతో అమరావతి రానున్న రోజుల్లో అద్భుతంగా నిర్మాణం గావించబడుతుందన్నారు.

# ఆయన కామెడీ విలన్.. నేను కామెడీ హీరో!

## 'రక్తకన్నీరు' నాగభూషణం పుస్తకావిష్కరణలో నటకిరీటి రాజేంద్రప్రసాద్



సీనియర్ జర్నలిస్ట్ ఉదయగిరి ఫయాజ్ రచించిన 'రక్తకన్నీరు' నాగభూషణం పుస్తకావిష్కరణ ఇటీవల నటకిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్ నివాసంలో ఆయన చేతులమీదుగా జరిగింది. ఎన్నో పాత్రలకు తన నటనతో ప్రాణం పోసిన విలక్షణ నటుడు స్వర్గీయ నాగభూషణం జీవిత విశేషాలు, సినీ ప్రస్థానానికి సంబంధించిన విషయాలను తెలియజేస్తూ ఫయాజ్ 'రక్తకన్నీరు' నాగభూషణం అనే పుస్తకాన్ని రచించారు. ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత ఫయాజ్, నాగభూషణం పెద్ద కుమారుడు రాఘవరావు, పెద్ద కుమార్తె మల్లీశ్వరి, అల్లుడు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'రక్తకన్నీరు' నాగభూషణం గారికి.. నాకు దగ్గరి పోలిక ఏంటంటే, నేను కామెడీని హీరోయిజం చేస్తే, ఆయన విలనిజంలోనూ కామెడీ చేశారు' అని అన్నారు. మరీ ముఖ్యంగా నాగభూషణంకు డబ్బింగ్‌లో చాలా గొప్ప పేరుందని, ఆయన షూటింగ్‌లో ఏ టైమింగ్‌లో డైలాగ్ చెబుతారో అదే టైమింగ్‌తో డబ్బింగ్‌ను కళ్లు మూసుకుని మరీ చెప్పగలరని అన్నారు. అంతేకాక, ఆయన రంగస్థలం నుంచి వచ్చిన గొప్ప నటులని, సినిమాల్లో నటించే రోజుల్లోనూ ఆయన స్టేజ్ షోలను విడిచి పెట్టలేదని అన్నారు. అలాంటి విషయాలను సీనియర్ జర్నలిస్ట్ ఫయాజ్ పుస్తక రూపంలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. పుస్తక రచనలో నాగభూషణం కుటుంబ సభ్యులు తనకు ఎంతగానో సహకరించారని ఫయాజ్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

## ఉత్తమ విద్యార్థులకు..

# అరుణమ్మ అభినందన



ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణతలు సాధించిన జడ్పీ స్కూళ్ళ విద్యార్థులను ఏప్రిల్ 30న జడ్పీ చైర్‌పర్సన్ అభినందించారు. 595 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన కృషినగర్ హైస్కూలు విద్యార్థిని ఎం.పూజిత, 594 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించిన నవలాకులతోట జడ్పీ హైస్కూలు విద్యార్థిని యం.డి.జువేరియా, 593 మార్కులు సాధించి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్న మరో ఇద్దరు విద్యార్థులు జి.జ్ఞాపిక (వింజమూరు జడ్పీ హైస్కూలు), జి.భార్గవ్(నరసాపురం జడ్పీ హైస్కూలు)లను ఆమె అభినందించి జ్ఞాపికలు అందచేశారు. అదేవిధంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.గిరిధర్‌సింగ్, పి శ్రీనివాసులు, సిహెచ్ మాలకొండయ్య, పి.నాగేశ్వరరావులను కూడా శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ యం.విద్యారమ, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, పలువురు విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

## కళాంజలి అనంత్ రూపొందించిన

# 'పండుటాకులు'కు.. జ్యూరీ అవార్డు!




కళాంజలి అనంత్ దర్శకత్వంలో రూపొందించిన 'పండుటాకులు' షార్ట్ ఫిలిమ్ మరో అవార్డును సొంతంచేసుకుంది. విజయవాడలో ఏప్రిల్ 27న అనంత్ ఈ అవార్డును అందుకున్నారు. విజయవాడకు చెందిన డాక్టర్ కెకెఆర్ హ్యాపీ వ్యాలీస్కూల్ వారు నిర్వహించిన షార్ట్ ఫిలిమ్ ఫెస్టివల్ -2025కు, ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి 86 షార్ట్ ఫిల్మ్స్ రాగా, అందులో 10 చిత్రాలను ఉత్తమమైనవిగా ఎంపిక చేశారు. వాటిలో 'పండుటాకులు'కు జ్యూరీ అవార్డు రావడం విశేషం. ఆ స్కూల్ అధినేత డా.కొసరాజు కోటేశ్వరరావు, 64 కళల డాట్‌కామ్ అధినేత కళాసాగర్, వరప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులందజేశారు. రంగస్థల దర్శకునిగా, నటునిగా, రచయితగానే కాక, షార్ట్ ఫిల్మ్‌ల నిర్మాణంలోనూ తనదైన ప్రతిభతో ఎన్నో అవార్డులు సాధిస్తున్న కళాంజలి అనంత్‌ను స్థానిక కళాకారులు అభినందిస్తున్నారు. 'పండుటాకులు' షార్ట్‌ఫిల్మ్‌కు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించిన కళాంజలి అనంత్‌తో పాటు, మాటల రచయిత కెకెఆర్ మూర్తి, నటుడు దువ్వూరు బెనర్జీలు ముఖ్యఅతిథుల చేతులమీదుగా జ్యూరీ అవార్డును అందుకున్నారు. చైతన్య, సురభి సంగీత్‌సౌరభ్ (సంగీతం), కిష్టోఫర్ (కెమెరా), నటీనటులు ధనుంజయ, పార్వతీశం, లహరి, డా.చెన్నకేశవ, మునిచంద్ర, ఎం.ప్రసన్నాంజనేయులు, అనూష తదితరులు పండుటాకుల్లో తమవంతు పాత్ర పోషించారు. కాగా, పండుటాకులుకు ఇది 9వ అవార్డు అవుతుందని కళాంజలి అనంత్ అంటూ, అన్ని అవార్డులు తెచ్చిపెట్టిన పండుటాకులు బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ఘోరం!..దారుణాతి దారుణం!

## • కారు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం
## • 5గురు మెడికోలతో పాటు..మరొకరు కన్నుమూత



***విధి ఎప్పుడు ఎలా వికటిస్తుందో తెలియదు. ఈ క్షణం ఉన్నవారు మరుక్షణం ఉంటారన్న ఆశ లేదు. హాయిగా ఓ నిశ్చితార్థం వేడుకకు వెళ్లి కారులో తిరిగివస్తున్న అయిదుగురు వైద్యవిద్యార్థులు మార్గమధ్యంలోనే రోడ్డు ప్రమాదానికి గురై కన్నుమూయడం ఎంత దారుణం. కారు వేగంగా వస్తూ అదుపుతప్పి ఓ ఇంట్లోకి దూసుకువెళ్ళడంతో అక్కడున్న మరో వ్యక్తి కూడా దుర్మరణం పాలయ్యాడు. ఇంకోవ్యక్తికి గాయాలు తగిలాయి. ఏప్రిల్ 30 బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగిన ఈ దుర్ఘటన జిల్లాలో సంచలనం కలిగించింది. మృతుల కుటుంబాల్లో తీరని దుఃఖాన్ని మిగిలించింది.***

వారంతా నెల్లూరులోని నారాయణ వైద్యకళాశాలలోచదువుకుంటున్న విద్యార్థులు. ఓ విద్యార్థి సోదరికి బుచ్చిరెడ్డిపాళెంలో వివాహ నిశ్చితార్థం ఉండడంతో పాతికమంది వైద్య విద్యార్థులు కార్లు, ఇతరత్రా వాహనాల్లో వెళ్ళారు. తిరుగు ప్రయాణంలో వేగంగా వస్తున్న ఓ కారు కోవూరు సమీపంలోని పోతిరెడ్డిపాళెం పెట్రోల్‌బంకు వద్ద అదుపుతప్పి, పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకు వెళ్ళింది. ఆ ఇంట్లో ఉన్న వెంకటరమణయ్య (56) ఆ ప్రమాదంలో మరణించాడు. కారులో ఉన్న ఆరుగురు వైద్య విద్యార్థుల్లో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం పాలు కాగా, తీవ్రగాయాల పాలైన మరో నలుగురిని వెంటనే నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. వారిలో చికిత్సపొందుతూ ముగ్గురు చనిపోయారు. ప్రమాదప్రాంతమంతా రక్తపు మడుగుగా మారింది. ఆ ఇల్లు ధ్వంసమైపోయింది. దుకాణంలో కూర్చుని ఉండగా కారు వేగంగా ఇంట్లోకి దూసుకురావడంతో, కూర్చున్న వ్యక్తి అలాగే కుప్పకూలిపోయి మరణించాడు. కారు నుజ్జునుజ్జయింది. అతివేగం వల్లనే ఈ దుర్ఘటన జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

### మృతుల స్నేహితుల ఆర్తనాదాలు..

కారు ప్రమాదంలో వైద్యవిద్యార్థులు మరణించారన్న సమాచారంతో విద్యార్థులు, వారి స్నేహితులు, బంధువులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. గాయాల పాలైన నవనీత్ శంకర్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. మృతిచెందిన వారిలో అనంతపురానికి చెందిన కె.అభిషేక్‌రాజ్, సంగం మండలం సిద్ధీపురానికి చెందిన గుండ్ల జీవన్‌చంద్రారెడ్డి, గుర్రం యజ్ఞేష్ (ఒంగోలు), అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన ఎల్ నరేష్‌నాయక్, తిరుపతి ప్రశాంతినగర్‌కి చెందిన గోను అభిసాయి పురుషోత్తం ఉన్నారు. నెల్లూరు పెద్దాసుపత్రిలోని శవాగారం వద్ద వారి మృతదేహాలను చూసి వారంతా పెద్దపెట్టున రోదించారు. తమ బిడ్డలు హటాత్తుగా మరణించడాన్ని వారి తల్లితండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ఘటన ఆయా కుటుంబాల వారిని శోకసముద్రంలో ముంచివేసింది.

# గుండె గు'బిల్లు'

## తాకితే షాక్ కొడుతున్న కరెంటు బిల్లులు

## విస్తుపోతున్న వినియోగదారులు

కూటమి ప్రభుత్వ పాలనలో విద్యుత్ బిల్లుల బాదుడు అంతకంతకూ తీవ్రమవుతోంది. షాక్ కొట్టేలా బిల్లులు వస్తుండడంతో వినియోగదారులు విస్తుపోతున్నారు. ముఖ్యంగా సర్దుబాటు ఛార్జీల పేరిట అదనపు మొత్తం విధిస్తుండడంతో బిల్లు తడిసి మోపెడవుతోందని జనం వాపోతున్నారు. కాగా, ఈ ప్రభుత్వ పాలనలో రెండుసార్లు సర్దుబాటు ఛార్జీల పేరిట బిల్లులు పెంచారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. రూ.9,412 కోట్ల మేర వినియోగదారుల నుంచి వసూలు చేయాలని డిస్కంలకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) గతంలో ఆదేశాలివ్వడంతో బిల్లులు అమాంతం పెరిగిపోతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆరునెలల క్రితం ఇదే తరహాలో 6,072 కోట్లు భారం మోపడం వల్ల వినియోగదారుల నుంచి యూనిట్కు రూ.2.19 చొప్పున అదనంగా వసూలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెప్తున్నారు. డిస్కంలకు నష్టాలను తగ్గించే క్రమంలో ప్రజలపై మోయలేని భారాన్ని వేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం కూడా ఇదే తరహాలో బిల్లులను పెంచిందని కూటమి నాయకులు ఎదురుదాడికి దిగుతుండడం గమనార్హం.

### బిల్లులో ఛార్జీల వసూలు ఇలా!

నిజానికి కరెంట్ బిల్లులో విద్యుత్ టారిఫ్ (బిల్డ్ యూనిట్స్) ప్రధానంగా ఉంటోంది. ఇది వినియోగదారుడు నెల రోజుల పాటు వాడుకున్న విద్యుత్కు చెల్లించే మొత్తంగా పేర్కొంటారు. అయితే దీనికి తోడు ఫిక్స్డ్ చార్జి (ట్రాన్స్ఫర్స్, విద్యుత్ స్తంభాలు, వైర్ల ఏర్పాటుకు సంబంధించిన ఎస్టాబ్లిష్మెంట్ చార్జి) నిజానికి ఒక ప్రాంతంలో కొత్తలైన్ల ఏర్పాటు చేసేటప్పుడు మాత్రమే ఈ చార్జి విధించాల్సిఉంది. అయితే 40 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన లైన్లు ఉండే ప్రాంతాల్లోనూ ఈ చార్జి విధిస్తుండడం వినియోగదారుడికి గుదిబండగా మారుతోంది. అదే సమయంలో కస్టమర్ చార్జీ పేరిట ట్రాన్స్ఫారం నుంచి ఇంటికి, వ్యాపార సంస్థకు తీసుకునే లైన్ నిర్వహణ పేరిట ఈ చార్జీని వసూలు చేస్తున్నారు. వాస్తవానికి మీటర్ కనెక్షన్ తీసుకునే సందర్భంలోనే ఈ మొత్తాన్ని వినియోగదారుడు చెల్లిస్తున్నాడు. కానీ, తర్వాత కూడా ఇదే పేరుతో విద్యుత్ పంపిణీ సంస్థలు వినియోగదారుడిపై భారం మోపుతుండడం గమనార్హం. ఇక ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో విద్యుత్ వినియోగదారుడి నుంచి ప్రభుత్వం వసూలు చేసే పన్ను కూడా కరెంటు బిల్లుకు అదనంగా యాడ్ అవుతోంది. ఇది యూనిట్కు ఆరు నుంచి 10 పైసల వరకు ప్రాంతాలను బట్టి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక వ్యాపార సంస్థలకు ఇది యూనిట్కు రూ.1 వరకు ఉంటోంది. దీంతో పాటు ట్రూఅప్ చార్జెస్, ఎఫ్పీపీసీఏ (ఇంధన సర్దుబాటు) చార్జెస్ పేరిట గతంలో వినియోగదారుడు చెల్లించిన విద్యుత్ ధరకు, డిస్కంలు కొనుగోలు చేసిన విద్యుత్ ధరకు మధ్య తేడాను గుర్తించి కొంతమొత్తం అదనంగా విధిస్తున్నారు. ఉదాహరణకు ఒక వ్యక్తి 2023లో ఒక యూనిట్కు 1.60పైసలు చొప్పున చెల్లించి విద్యుత్ వినియోగించుకుంటే, ఆ సమయంలో డిమాండ్ మేరకు విద్యుత్ను అందించేందుకు డిస్కంలు ఇతర సంస్థల నుంచి విద్యుత్ను ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేసి ఉండి ఉంటే, ప్రస్తుతం ఆ మొత్తానికి సరిపడా చార్జిని మొత్తం వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిస్తోంది. ఒకవేళ ఎవరైనా బాడుగ ఇంటిలో ఉన్నా, ఇల్లు మారినా అప్పట్లో ఆ ఇంటిలో ఉన్నవారు వాడుకున్న విద్యుత్కు ఇప్పుడున్న వ్యక్తులు అదనపు చార్జి చెల్లించాలన్నమాట. ఇలా వసూలు చేయడం ఎంతవరకు సమంజసమో ప్రభుత్వం, విద్యుత్ నియంత్రణ మండలికే ఎరుక. ఇక ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ ట్రూఅప్ చార్జీలను ఏనెలకానెల చొప్పున వసూలు చేయాలని ఆదేశించడంతో నెలనెలా అదనపు మొత్తం వినియోగదారుడు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇలా వాస్తవంగా కరెంటు వినియోగించిన బిల్డ్ యూనిట్ల కంటే అదనంగా డిస్కంలు రకరకాల పేర్లతో వసూలు చేస్తుండడంతో విద్యుత్ బిల్లులు



కొండవీటి చాంతాడంతగా పెరుగిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అదనపు సుంకాలను తగ్గించి వాస్తవంగా వినియోగించిన విద్యుత్కే బిల్లు వసూలు చేయాలని సగటు వినియోగదారుడు డిమాండ్ చేస్తున్నాడు.

### స్మార్ట్గా దోపిడీ!

సాధారణంగా మీడియాలో వార్తలకు.. స్పేస్టైమ్, ప్రైమ్టైమ్ ఉంటుంది. స్పేస్ అంటే ఎక్కువ మంది చూడని సమయం అంటే ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు. ఈ టైంలో జనం వారి వారి వృత్తి ఉద్యోగాల్లో బిజీగా ఉండడం, ప్రయాణాల్లో ఉండడం వల్ల టీవీ చూసే సమయం దొరకదు. అందుకే ఈ సమయంలో టీవీల్లో వచ్చే యాడ్స్కు కూడా పెద్దగా డిమాండ్ ఉండదు. వాటికి ధర చెల్లింపు కూడా తక్కువగానే ఉంటుంది. ఇక సాయంత్రం 6 నుంచి 9 వరకు ప్రైమ్ టైంగా పేర్కొంటారు. ఈ సమయంలో ప్రజలు ఎక్కువగా ఇళ్లలోనే ఉండే అవకాశం ఉండడంతో టీవీలకు అతుక్కుపోతారు. ఈ సమయంలో వచ్చే యాడ్స్కు, సీరియల్స్కు, వార్తలకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ఇవన్నీ చానెళ్ల వ్యాపార సూత్రాలు. ఇదే విధానాన్ని ప్రభుత్వం కూడా అనుసరిస్తోంది. ఉదయం వేళలో రోజువారీ కాలకృత్యాలకు, లంచ్ బాక్స్లు సిద్ధం చేసుకోవడం కోసం ఎలక్ట్రిక్ పరికరాలను జనం ఎక్కువగా వినియోగిస్తారు. అదే సమయంలో సాయంత్రం ఇళ్లకు వచ్చాక ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు అధికంగా వాడతారు. లైట్లు వేస్తారు. దీన్ని అధికారులు ప్రైమ్ టైంగా నిర్ణయించి స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రత్యేక చార్జీ విధిస్తూ యూనిట్కు ఎక్కువ మొత్తం చొప్పున వసూలు చేస్తుండడంపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### వేసవిలో రెట్టింపుగా!

వేసవికాలం ప్రారంభం కావడంతో విద్యుత్ వినియోగం రాష్ట్రంలో భారీగా పెరిగింది. దీంతో ఎండలతో పాటు బిల్లులు సైతం మండిపోతున్నాయంటూ వినియోగదారులు లబోదిబోమంటున్నారు. రాష్ట్రంలో సాధారణంగా రోజుకు 200 నుంచి 220 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంటుంది. అయితే వేసవి కాలమైన ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రోజువారీ డిమాండ్ దాదాపు 245 నుంచి 270 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈమేరకు ఏడాదికి 64 వేల మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ అవసరమవుతుంది. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 24 వేల మెగావాట్ల వరకు ఉంది. దీంతో వివిధ సంస్థలతో ఒప్పందాల మేరకు డిమాండ్కు సరిపడా విద్యుత్ను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అదనపు ఛార్జీల పేరిట వినియోగదారుడి నుంచి అదనంగా ముక్కుపిండి వసూలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు. ఏదేమైనా చార్జీలు పెంచబోమంటూ గద్దెనెక్కిన పాలకులు వినియోగదారులపై భారం మోపుతుండడం మాత్రం సహేతుకం కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొసమెరుపేంటంటే ఈ అదనపు చార్జీల బాదుడు వల్ల ధనవంతులు, వ్యాపారులకంటే సామాన్య, మధ్యతరగతి వినియోగదారులే అత్యధికంగా నష్టపోతుండడం గమనార్హం. కొన్ని సందర్భాల్లో ఇవి వాస్తవ బిల్లుకంటే రెట్టింపుస్థాయిలో ఉండడం వినియోగదారులను విస్మయపరుస్తోంది.

"పాలకులారా వర్థిల్లండి – అమాయక జనులారా ఇలా మోసపోతూనే ఉండండి"...!

7వ వర్ధంతి



శ్రీ గణపం ఓబులరెడ్డి గారు

జననం: 16.12.1939 నిర్యాణం: 05.05.2018

అమృతమూర్తి దివ్యస్మృతికి మా నివాళి.

- కుటుంబసభ్యులు





# మంత్రి ఆనంను కలిసిన.. నందన్

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వై.ఓబులేసు నందన్ ఏప్రిల్ 27న నెల్లూరులోని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి, కమిషనర్ నందన్‌ను అభినందించి, నెల్లూరు నగరాభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు.

# ఘనంగా.. 'మెక్సోడియా 2025'




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఇటీవల 'మెక్సోడియా 2025' వేడుకలు ఘనంగా జరిగాయి. బహుళ జాతి సంస్థ టాటా ఎల్క్సి (యూకే)లో లీడ్ డిజైన్ ఇంజనీర్‌గా ఉన్న నాగార్జున సుంకం ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'కెరీర్ ఆపర్చునిటీస్ ఫర్ డిజైన్ ఇంజనీర్' అనే అంశంపై ఆయన మాట్లాడుతూ, ఏరోస్పేస్, ఆటోమోటివ్ మరియు బయో మెడికల్ రంగాలలో మెకానికల్ విద్యార్థులకు డిజైన్ ఇంజనీర్లుగా విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం నుంచి తమ కళాశాలలో రోబోటిక్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో ఎంటెక్ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశారు. వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 250 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.రామ్‌కుమార్‌రెడ్డి అభినందించారు. మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ఆర్ విక్రమ్‌కుమార్, మెక్సోడియా కన్వీనర్ డాక్టర్ బి.మధు సూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరిదేవికి.. సతీష్‌రెడ్డి పూజలు

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ శాస్త్రవేత్త డా. జి.సతీష్‌రెడ్డి ఏప్రిల్ 25న సందర్శించారు. అమ్మవారికి ఖడ్గమాల తదితర ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం, వేదమంత్రాలతో ఆశీర్వచన కార్యక్రమాలు చేయడం జరిగింది. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 3న.. సర్వేపల్లి సిస్టర్స్ సంగీత కచేరి



నెల్లూరులోని ప్రముఖ కర్నాటక శాస్త్రీయ సంగీత కళాకారులు.. 'సర్వేపల్లి సిస్టర్స్'గా పేరొందిన డా. శ్రేయ, డా.రాజ్యలక్ష్మిలు మే 3న నెల్లూరు టౌన్‌హాలులో కర్నాటక శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించనున్నారు. స్థానిక గాయత్రి సేవా సమాజం రజతోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, ఆడిటర్ పి.శివకుమార్, గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రి, ప్రముఖ వైద్యూరాలు.. న్యూరో సర్జన్ డాక్టర్ వెంకటేశ్వర ప్రసన్న, రేడియాలజిస్ట్ డాక్టర్ హిమబిందు పాల్గొననున్నారు. దేశభొట్ల ఫణిరత్నం ఆధ్వర్యంలో సభ జరుగు తుంది. సంగీతవేత్తలు, సంగీతాభిమానులందరూ ఈ కార్యక్రమా నికి విచ్చేసి జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల ఔదార్యం



నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న పోలమ్మ భర్త ఇటీవల అనారోగ్యంతో మరణించారని తెలిసి స్థానిక భీమ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ మనోజ్‌కుమార్ సూచనల మేరకు పారిశుద్ధ్య కార్మికులు అందరూ కలిసి 10వేల రూపాయలను ఆ కుటుంబానికి తమవంతు ఆర్థిక సహాయంగా ఇటీవల అందజేశారు. భవిష్యత్తులో కూడా వాళ్ళ కుటుం బానికి ఎటువంటి సహాయ సహకారాలు కావలసి ఉన్నా తమ యూనియన్ అండగా ఉంటుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుమతి, యాలమ్మ, స్వరూప, విజయమ్మ పాల్గొన్నారు.

# మెట్టు సాహితీ సేవలు స్ఫూర్తిదాయకం

## • సంస్మరణ సభలో కవులు, కవయిత్రులు





పద్యకళా పరిషత్ అధ్యక్షులు, ఇటీవలే దివంగతులైన మెట్టు రామచంద్రప్రసాద్ సాహితీ సేవలు స్ఫూర్తిదాయకమని ప్రముఖ కవి చిన్ని నారాయణరావు కొనియాడారు. ఏప్రిల్ 27వ తేదీ ఆదివారం సాయంత్రం జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో కీ॥శే॥ మెట్టు రామచంద్రప్రసాద్ సంస్మరణ సభ జరిగింది. చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్, నెరసం(నెల్లూరు జిల్లా రచయితల సంఘం), పెరసం(పెన్నా రచయితల సంఘం)లు పాల్గొన్నాయి. అనేక మంది కవులు, సాహితీవేత్తలు పాల్గొని మెట్టు వారికి ఘననివాళులర్పించారు. రామచంద్రప్రసాద్ కుమారుడు మెట్టు శ్రీధర బాబు, కుమార్తె స్వరాజ్యలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. చిన్ని నారాయణరావు మాట్లాడుతూ మెట్టు మరణం చాలా బాధాకరమని, కవులకు ఆయన అందించిన స్ఫూర్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన చిన్ని నారాయణ రావు సాహితీ ఫౌండేషన్ ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహించిందని, ప్రముఖ నవలా రచయిత శ్రీరామకవచం సాగర్ రాసిన 'నిర్వేదం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించడం మహద్భాగ్య మని పేర్కొన్నారు.

మెట్టు రామచంద్రప్రసాద్ మిత్రులు, వాకర్స్ గవర్నర్ ఎలెక్ట్ నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ తామిద్దరం ప్రతి కార్యక్రమానికి కలిసి వెళ్ళేవార మని గుర్తుచేసుకొని బాధాతప్త హృదయంతో వ్యధ చెందారు.

పెరసం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి మాట్లాడుతూ అన్ని సాహితీ సంస్థలకు ఆయన అందించిన సౌజన్యం వెలకట్ట లేనిదని పేర్కొన్నారు. పెరసం గౌరవాధ్యక్షులు అవ్వారు శ్రీధరబాబు, నెరసం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ 'మెట్టు' వారి ఔన్నత్యాన్ని శ్లాఘిస్తూ ప్రసంగించారు.

ఆయన పేరు మీద అవార్డు ఇచ్చే విషయాన్ని ప్రస్తావించిన సభికులకు ఆ విషయాన్ని కుటుంబంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మెట్టు శ్రీధర్‌బాబు చెప్పారు. అద్వకేటు శ్రీ వినయ, కవయిత్రులు నజ్మా భారతి, తోట సులోచన, నాగేశ్వరి, విజేత, పద్యకళా పరిషత్ సభ్యులు కోట రాజశేఖర్, కోట శ్రీరామ్మూర్తి, కథకులు పొట్లూరి సుబ్రహ్మణ్యం మాట్లాడారు. నెరసం అధ్యక్షులు జయప్రకాష్ పాల్గొని నివాళులర్పించారు. కవులకు కల్పతరువులా భాసిల్లిన మెట్టు రామచంద్ర ప్రసాద్ మరణం చాలా లోటని ఆవేదన చెందారు. చిన్ని నారాయణరావు, బొగ్గరపు రాధా కృష్ణమూర్తిలు ఆయనపై రాసిన కవితల్ని వినిపించారు.

# టూకీగా...



## మర్రిపాడులో బాల్యవివాహాలపై అవగాహన

బాల్యవివాహాలు నేరమని చెప్తూ, ఏప్రిల్28న మర్రిపాడులో శిశు సంక్షేమశాఖ వారు, వెలుగు పథకం అధికారులు ప్రజలకు అవగాహన కలిగించారు. బాల్యవివాహాల వల్ల బాలల జీవితాలకు ఎన్నో ఇబ్బందులున్నాయని, అందువల్ల వాటి నిరోధానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని చెప్పారు.

## ఆత్మకూరు మునిసిపాలిటీలో కలుషిత నీరు

ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కలుషిత నీరు వస్తోందని, అధికారులు వెంటనే అరికట్టి, ప్రజలకు పరిశుభ్రమైన నీరందించాలని సీపీఎం ఎల్ఆర్‌పల్లి శాఖ నాయకులు ఇటీవల మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు దేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పొదలకూరులో డొక్కా సీతమ్మ వర్ధంతి

ఆకలిగొన్నవారికి అన్నం పెడుతూ ఆంధ్రుల అన్నపూర్ణగా పేరుతెచ్చుకున్న మహనీయురాలు డొక్కా సీతమ్మ వర్ధంతిని ఏప్రిల్ 28న పొదలకూరు శ్రామికనగర్ గిరిజన కాలనీవాసులు ఘనంగా జరుపుకున్నారు. తొలుత, సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, ఎన్.రవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## గండిపాళెంలో ఆశా కార్యకర్తలకు యూనిఫాం

ఉదయగిరి మండలం గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆశా కార్యకర్తలకు రెండు జతల వంతున ప్రభుత్వం పంపిన యూనిఫాంలను ఏప్రిల్ 28న అందజేశారు. డాక్టర్ వినీత, వైద్యాధికారి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఆశా కార్యకర్తలు యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని వారు చెప్పారు.

## దేవరపాళెంలో భగవద్గీత ప్రచారం

నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాళెం తదితర గ్రామాల్లో ఏప్రిల్ 28న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి వారి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేశారు. గ్రామాల్లోని ప్రజలకు భగవద్గీత పట్ల అవగాహన కలిగించారు.

## తిరువీధిపాడులో పేకాటరాయుళ్ళ అరెస్ట్

దగదర్తి మండలం తిరువీధిపాడు గ్రామంలో పోలీసులు దగదర్తి ఎస్ఐ జంపాని కుమార్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 28న ఓ పేకాటస్థావరంపై దాడిచేసి అయిదుగురు పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకున్నారు వారి వద్ద నుంచి 1930 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.

## రాపూరులో ఆర్టీసీ ఉద్యోగుల దీక్షలు

రాపూరులో ఆర్టీసీ ఉద్యోగులు నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో తమ సమస్యల సాధనకు దీక్షలు చేపట్టారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళా ఉద్యోగినులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరుచేయాలని, తదితర డిమాండ్ల సాధనకు దీక్షలు చేపట్టినట్లు డిపో సెక్రటరీ ఏవీ రమణయ్య తెలిపారు.

## రుద్రకోట వద్ద.. గ్రావెల్ వాహనాల పట్టివేత

కావలి మండలం రుద్రకోట తిప్పవద్ద అక్రమంగా గ్రావెల్‌ను తరలించుకుపోతున్న నాలుగు టిప్పర్లను, ఒక జేసీబీని కావలి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఏప్రిల్ 28న రాత్రి సమయంలో గ్రావెల్ తవ్వుతున్న ఆ వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించి, వాటి యజమానులను విచారిస్తున్నారు.

## మనుబోలులో వేసవి విజ్ఞాన శిబిరం

మండల కేంద్రమైన మనుబోలులోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఏప్రిల్ 28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు. గ్రంథాలయ అధికారి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో, పిల్లల మానసిక వికాసానికి వారితో కథలు చదివించడం, బొమ్మలు వేయించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు.








# ఉత్తరక్రియలు

నెల్లూరు, వి.ఆర్.కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు
సుప్రసిద్ధ సాహితీవేత్తలు, 'పద్యకళా పరిషత్' అధ్యక్షులు
పౌల్ట్రీ పారిశ్రామికవేత్త, మా పెద్దదిక్కు

## కీ॥శే॥ మెట్టు రామచంద్రప్రసాద్ గారు
(M.R.ప్రసాద్)

తేది. 22.04.2025 మంగళవారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : **మెట్టు పరమేశ్వరమ్మ**

కుమారులు - కోడళ్ళు
**మెట్టు జయశంకర్ - కిరణ్మయి**
**మెట్టు శ్రీధర్‌బాబు - చైతన్యమయి**
**రాధిక (W/o లేట్ మెట్టు శివకుమార్)**

కుమార్తె
**ఒగ్గు స్వరాజ్యలక్ష్మి** (W/o లేట్ ఒగ్గు సుధాకర్)

మనుమలు, మనుమరాండ్రు
**మెట్టు సంజయ్‌ప్రసాద్**
**మెట్టు కళ్యాణతేజ, మెట్టు లలితాదేవి**
**మెట్టు లీలాకృష్ణప్రసాద్, మెట్టు శరత్‌చంద్రప్రసాద్**
**శివగామిని - ఎన్.గిరీష్‌కుమార్, ఓ.సుధీర్ - మాల్విక**
**లక్ష్మీ సౌందర్యరాశి - వి.సూర్య**

ముదిమనుమలు, ముదిమనుమరాండ్రు : **కార్తికేయ, నందిని, హాసిని**

**ఉత్తరక్రియలు :** వారి పెద్దకర్మ తేది. **08.05.2025 గురువారం** ఉదయం 9.00 గంటలకు నెల్లూరు, నేతాజీనగర్, 4వ క్రాస్‌రోడ్‌లోని వారి స్వగృహము నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

చిరునామా కొరకు
క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com